
పైసలిస్తేనే పని..!

డబ్బులొచ్చే ఫైళ్లు పరుగులు



అనంతపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య, ఆరోగ్యశాఖ కీలకమైనది. అలాంటి కీలక శాఖలో బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రజారోగ్యం మాట అటుంచితే.. చివరకు ఫైళ్లు కదలాలన్నా పైసలు ఇవ్వాల్సిందేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైసలు వచ్చే ఫైళ్లు పరుగులు పెడతాయని, కాసులు రానివి, చివరకు శాఖకు చెందిన వివిధ విభాగాల ఫైళ్లు ఒక్కఅడుగు కూడా ముందుకు కదలవనే చర్చ ఆ శాఖలో వినిపిస్తోంది. ఎవరైనా అడిగితే అది మాకు సంబంధం లేదు.. అంటూ తప్పించుకుంటారని తెలుస్తోంది. అందుకే ఎవరైనా ఆ శాఖలో ఫైళ్ల గురించి మాట్లాడితే.. 'మా ఆఫీసులో అంతే సార్.' అంటూ సమాధానం వస్తుంది.

ఆదాయం వచ్చే ఫైళ్లకే మొగ్గు..?

వైద్యశాఖలో ఉన్నతాధికారి ఆదాయం వచ్చే ఫైళ్లకే మొగ్గుచూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఆర్‌ఎంపీల క్లినిక్‌లకు అనుమతులు, రెన్యువల్స్ కాసులు కురిపిస్తున్నాయనే చర్చ ఆ శాఖలో ఉంది. ముందుగా రేటు సరిపోతేనే ఫైళ్లను క్లియర్ చేస్తారని తెలుస్తోంది. లేకపోతే నిబంధనల పేరుతో సాకులు చూపి పక్కన పెట్టేస్తారని సమాచారం. అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి ప్రాంతాలకు చెందిన కొందరు రెన్యువల్స్‌కు ఫైళ్లు పెట్టుకోగా.. అడిగిన మేరకు డబ్బులు ఇచ్చిన వారి ఆసుపత్రులకు పరిశీలించకుండానే ఆమోదం వేసిపంపారని.. అదే అడిగినంత డబ్బు ఇవ్వని వాళ్ల ఫైళ్లను పక్కన పెట్టి.. ఆయా ఆసుపత్రులకు తమ సైన్యంతో వెళ్లి ప్రతిదీ నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అని పరిశీలిస్తారని తెలుస్తోంది. మరో వైపు కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారంటూ బెదిరిస్తారని సమాచారం. దీంతో ఆ ఆసుపత్రుల యాజమాన్యాలు భయపడిపోయి అడిగినంత ఇచ్చుకుని ఆమోదం వేయించుకుంటారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏదైనా ఘటన జరిగితే వీళ్లకు పండుగే. ఆందోళనలు చేస్తున్న సమయంలో వచ్చి ఆసుపత్రి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తారు. సీజ్ చేస్తున్నామంటూ బెదిరించి ఆందోళనకారులను శాంతింపజేస్తారు. తర్వాత ఏమిజరుగుతుందో కానీ అటువైపు కూడా కన్నెత్తిచూడరు. ఒకవేళ సీజ్‌చేసినా.. కొద్దిరోజులకే ఆ ఆసుపత్రులు తెరచుకుంటాయి. రాయదుర్గం, తాడిపత్రి. గుంతకల్లు, అనంతపురంలో అనేక ఆసుపత్రులను సీజ్‌చేసి తర్వాత అనుమతి ఇవ్వడానికి పెద్దఎత్తున పైసలు చేతులు మారాయన్న ప్రచారం జరుగుతోంది.

కాసులు లేనివి కదలవు

అడిగితే తనది కాదంటూ తప్పించుకుంటున్న వైనం

వైద్య, ఆరోగ్య శాఖలో వసూళ్ల పర్వం



జిల్లా వైద్యశాఖ కార్యాలయం

నెలలైనా ఆ శాఖ ఫైళ్లు అంతే..

వైద్యశాఖకు సంబంధించిన ఫైళ్ల గురించి ఉన్నతాధికారి అసలు పట్టించుకోరని విమర్శలు ఉన్నాయి. వైద్యశాఖ పరిధిలో అనేక పథకాలు, సేవలు అమలు చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, సీహెచ్‌ఓలు, ఎంపీహెచ్‌ఓలు.. ఇలా అనేక మందికి సంబంధించిన జీతాలు, ఈఎల్స్, మెటర్నటీ, ఇంక్రిమెంట్లతోపాటు పలు రకాల ఫైళ్లు ఆయా విభాగాలు ఉన్నతాధికారి ఆమోదం కోసం పంపుతాయి. ఈ ఫైళ్ల గురించి మాత్రం పట్టించుకోరని సమాచారం. నెలల తరబడి అక్కడే మూలుగుతూ ఉంటాయని, ఎవరైనా అడిగితే.. ఇపుడు కలెక్టర్ మీటింగ్ ఉంది మళ్లీ మాట్లాడదామంటూ తప్పించుకొని వెళతారని సమాచారం.

బదిలీ వస్తుందనే వసూళ్లా..?

వైద్యశాఖలో కీలక అధికారి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగోన్నతి పొందారు. ఆ సమయంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిపార్సుతో ఈ జిల్లాకు వచ్చారనే ప్రచారం ఉంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిశాఖలకు బదిలీలు చేపట్టినా ఆరోగ్యశాఖకు మినహాయింపు ఇచ్చింది. మే, జూన్ నెలల్లో తప్పనిసరిగా బదిలీలు ఉంటాయనే చర్చ వినిపిస్తోంది. అప్పుడు ఇక్కడి నుంచి కదలాల్సి ఉంటుందనే బరితెగించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆ శాఖలో బహిరంగంగా వినిపిస్తున్నాయి. నమ్మకస్థులైన కొందరిని దగ్గరకు చేర్చుకొని వసూళ్ల పర్వం సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఎవరైనా అడిగితే ఆ అధికారికి సంబంధిత శాఖ మంత్రి, జిల్లా ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయని అనుచరగణం గొప్పగా చెప్పుకుంటున్నారని తెలుస్తోంది. వైద్యశాఖలో ఈ స్థాయిలో దందాలు సాగుతున్నా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

వీడిన వైసీపీ గ్రహణం

ఐదేళ్ల తరువాత కోనాపురం చెరువుకు కృష్ణాజలాలు

పూర్తిగా నిండటంతో అన్నదాతల హర్షం

మంత్రి పయ్యావుల చొరవతో తొలగిన అడ్డంకి



ఇది ఉరవకొండ మండలంలోని కోనాపురం చెరువు. టీడీపీ హయాంలో హంద్రీనీవా కాలువ నుంచి ప్రత్యేక కాలువ తవ్వి చెరువుకు కృష్ణాజలాలు విడుదల చేశారు. అలా చెరువును నింపి.. అన్నదాతలకు ఆనందం పంచారు. ఐదేళ్లూ నీటితో చెరువు కళకళలాడింది. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక చెరువుకు గ్రహణం పట్టింది. పరిహారం విషయంలో వైసీపీ మద్దతుదారుడు అభ్యంతరం తెలపడంతోపాటు చెరువుకు నీటిని విడుదల చేయకుండా అడ్డుకున్నాడు. దీంతో వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా చెరువుకు నీరు చేరక వట్టిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. పరిహారం విషయంలో అడ్డుపడుతున్న వ్యక్తికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. నీటి విడుదలకు మార్గం సుగమమైంది. ఐదేళ్ల తరువాత చెరువుకు జలకళ వచ్చింది. పూర్తిగా నిండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉరవకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో చెరువులకు చుక్కనీరు కూడా చేరలేదు. దీంతో కళ్లెదుటే కాలువల్లో నీరు పారుతున్నా చెరువుకు నీరు సరఫరా కాకపోవడంతో గత ఐదేళ్లూ ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు.

ప్రస్తుత ప్రభుత్వం చెరువులకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను విడుదల చేస్తోంది. దీంతో చెరువులు కళకళలాడుతున్నాయి. మండలంలోని కోనాపురం చెరువు 70 ఎకరాల్లో ఉంది. చెరువులోకి నీరు చేరడం వల్ల కోనాపురం, ముష్టూరు గ్రామాల పరిధిలో 2000 ఎకరాలకు లబ్ధి చేకూరనుంది.

ఐదేళ్లూ అవస్థలు

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ సానుభూతిపరుడు తనకు పరిహారం సరిగ్గా అందలేదని నీటి విడుదలను అడ్డుకున్నాడు. దీంతో ఐదేళ్లూ చెరువుకు నీరు అందలేదు. రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు సమస్యలకు పరిష్కారం చూపింది. వైసీపీ హయాంలో జరుట్ల రాంపురం చెరువును కూడా నిర్లక్ష్యం చేశారు. చుక్కనీరు ఇవ్వలేదు. ప్రస్తుతం ఆ చెరువుకు కూడా నీరు చేరడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని గ్రామస్థులు తెలిపారు. భూగర్భజలాలు పెరిగాయి. పశువులకు నీటి కష్టాలు తీరాయి.

ఐదేళ్లూ ఇబ్బందులు పడ్డాం



ఐదేళ్లూ చెరువుకు నీరు చేరక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం మంత్రి కేశవ్ చొరవతో చెరువు నింపారు. వేసవిలో కూడా బోర్ల కింద పంటలు పండించుకునే అవకాశం ఉంది. పశువులకు నీటి కష్టాలు తీరాయి.

\- అశోక్, కోనాపురం

వైసీపీ అవినీతిపై చర్యలు తీసుకోండి..!

● అధికారులకు జేసీ ప్రభాకర్ రెడ్డి వినతి ● తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయింపు



మాట్లాడుతున్న చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శనివారం బైఠాయించారు. కార్యాలయం లోపలికి రావాలని ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దారు రజాక్ వలి ఆహ్వానించినా, ఆయన నిరాకరించారు. దీంతో అధికారులు ఇద్దరూ ఆయన వద్దకే వచ్చి వివరాలు అడిగి, వినతి పత్రం తీసుకున్నారు. వైసీపీ నాయకుల అవినీతి వివరాలు అందులో ఉన్నాయని, చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'విజయసాయిరెడ్డి ఇంటి గోడలనే కూల్చివేశారు. ఇక్కడ మీది కూల్చడం మున్సిపాలిటీకి సామాన్యమైన విషయం. అన్నీ అధికారికంగానే చేస్తున్నాం..' అని వైసీపీ నాయకులనుద్దేశించి అన్నారు. ఫయాజ్ బాషాకు మున్సిపల్ అధికారులు పలు మార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, అందుకే తాను వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తాను వెళ్లకపోతే పరిస్థితి మరోలా ఉండేదని అన్నారు. పోలీసులు వైఫల్యం కారణంగానే శుక్రవారం ఆ సంఘటన జరిగిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటితోపాటు నాగిరెడ్డి, రమేష్‌రెడ్డి, అంబటి రాఘవరెడ్డి ఇళ్లను కూడా మున్సిపాలిటీ చట్టం ప్రకారం కూల్చివేస్తామని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ చూపకపోతే త్వరలో తానే వెళ్లి ఇళ్లను కూల్చివేస్తానని అన్నారు. 'పైనుంచి మా చేతులు కట్టివేస్తున్నారు. ఇకమీదట ఎవరి మాటా వినేది లేదు. మాకు జరిగిన అవమానం మీకు జరిగితే ఇలా మాట్లాడతారా? నేను, నా కొడుకు జైలు గోడల మధ్య గడిపిన జీవితం గుర్తు తెచ్చుకుంటే ఆ పరిస్థితి ఎవరికీ రాకూడదని అనిపిస్తుంది. అయ్యా చంద్రబాబు..! మాకు జరిగిన అన్యాయాన్ని గమనించండి. దయ చేసి అది చేయకు, ఇది చేయకు అని అడ్డు చెప్పకండి' అని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్దారెడ్డి చరిత్ర నీచమైనది

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చరిత్ర నీచమైనదని, చెప్పాలంటే తనకు ఆత్మాభిమానం అడ్డు వస్తుందని జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆందోళన అనంతరం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. తాను విలువలతో కూడిన రాజకీయాలు చేస్తానని అన్నారు. ఏ పార్టీ వచ్చినా రాజకీయం చేస్తా, ఫ్యాక్షన్ చేస్తా అని ప్రగల్భాలు పలికి పెద్దారెడ్డికి దమ్ముంటే తాడిపత్రికి రావాలని సవాలు విసిరారు. 'కోర్టు అనుమతి లేదని చెప్పడం కాదు. నీ కొడుకులు ఏమయ్యారు? వారిని పంపించు. వారు దద్దమ్మల్లా దాచిపెట్టుకున్నారు. ఆ రోజు మా ఇంట్లోకి వచ్చి ప్రగల్భాలు పలికావు. ఇప్పుడు ఏమయ్యాయి..? నాలుగు సెంట్లలో ఇంత పెద్ద భవనం ఎలా నిర్మిస్తావు? కోమటికుంట్లలో 45 ఎకరాలు కొటేశావు..' అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో పోలీసులు తమపై కక్ష సాధించారని, అభం శుభం ఎరుగని తన కుమారుడి మీద ఎన్నో కేసులు పెట్టించి జైలు జీవితం గడిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. 'రాత్రి.. పగలు వస్తాయి అని అంటున్నావు. అప్పుడు నీకు గుర్తురాలేదా.. రాత్రి పగలు వస్తాయని..?' అని పెద్దారెడ్డిని ప్రశ్నించారు.

నిధులు దారి మళ్లించారు..!

శింగనమల-గార్లదిన్నె డబుల్ రోడ్డుపై వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం

నిధులు మళ్లించి.. పనులు అటకెక్కించిన వైనం

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ప్రతిపాదనలు

పనుల ప్రారంభానికి చర్యలు



శింగనమల-గార్లదిన్నె రోడ్డు

శింగనమల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది. తెలుగు రాష్ట్రాల రాజధానుల రోడ్లను కలుపుతూ తలపెట్టిన శింగనమల-గార్లదిన్నె రెండు వరుసల రహదారి నిర్మాణంపై నీళ్లు చల్లారు. ఉన్న నిధులను దారి మళ్లించారు. ఖజానా ఖాళీ చేశారు. కొత్త ప్రభుత్వం ఆ పనులపై దృష్టి పెట్టింది. పనుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఆ మేరకు అధికారులు అంచనాలను పెంచి, ప్రతిపాదనలు పంపారు. దీంతో త్వరలోనే పనులు పునఃప్రారంభిస్తారని ప్రజలు, వాహనదారులు ఆశలు పెంచుకున్నారు.

దూరం తగ్గుతుందని..

అనంతపురం నుంచి అమరావతికి వెళ్లే రహదారిని శింగనమల మీదుగా గార్లదిన్నె వద్ద హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారితో కలుపుతు రోడ్డు నిర్మాణానికి 2011లో ప్రభుత్వం ఉపక్రమించింది. రోడ్లు, భవనాల శాఖ రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణంతో కడప, తాడిప్రతి నుంచి వచ్చే వాహనాలు జిల్లా కేంద్రం అనంతపురానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. నేరుగా హైదరాబాద్ జాతీయ రహదారిలోకి వెళ్తాయి. అక్కడి నుంచి వచ్చే వాహనాలు సైతం శింగనమల మీదుగా అమరావతి రహదారిలోకి వెళ్లొచ్చు. దీంతో వాహనదారులకు దాదాపు 30 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుంది. పది గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

నిధులున్నా..

శింగనమల-గార్లదిన్నె డబుల్ రోడ్డు నిర్మాణానికి 2011లో మొదటి విడతగా రూ.20 కోట్లు మంజూరు చేశారు. స్థల సేకరణ, విద్యుత్తు స్తంభాలు మార్చే పనులు మొదలెట్టారు. ఆ తర్వాత మూడేళ్లపాటు పనులు నిలిపివేశారు. 2015లో మరోసారి పనులు చేపట్టారు. శింగనమల మరవకొమ్మ నుంచి రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు పనులు చేపట్టారు. రూ.20 కోట్లలో రూ.10 కోట్ల వరకు నిధులు ఖర్చు చేశారని అధికారులు చెబుతున్నారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక రోడ్డు పనులను పూర్తిగా అటకెక్కించింది. అందుకు కేటాయించిన నిధులను సైతం మళ్లించింది. ఇతర పథకాలకు కేటాయించడంతో రోడ్డు నిర్మాణం ఊసేలేకుండా పోయింది.

రూ.80 కోట్లతో ప్రతిపాదనలు

శింగనమల-గార్లదిన్నె డబుల్ రోడ్డు నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది. 2011 నాటితో పోల్చుకుంటే ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. దీంతో ప్రస్తుత ధరల ప్రకారం రూ.80 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి అధికారులు.. ప్రభుత్వానికి పంపారు. త్వరలోనే పనులు ప్రారంభం కావచ్చని తెలుస్తోంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ప్రయాణ దూరం తగ్గడంతోపాటు చాలా సౌలభ్యంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

నియోజవర్గ కేంద్రానికి ఈ రోడ్డు అవసరం

శింగనమల-గార్లదిన్నె రెండు వరుసల రోడ్డు పనులు అటకెక్కాయి. గత వైసీపీ పాలనలో రోడ్డుకు కేటాయించిన నిధులు మళ్లించడంతో పనులు చేస్తారో.. లేదో.. తెలియని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే శింగనమల అభివృద్ధికి బాటలు పడడం ఖాయం.

\- నరేష్, శింగనమల

కొత్త ధరల ప్రకారమే ప్రతిపాదనలు

మొదటి విడత రోడ్డు పనులకు గతంలో రూ.20 కోట్లు మంజూరైనట్లు తెలిసింది. ఆ నిధులు కొంతవరకు ఖర్చవడంతో మిగిలిన వాటిని ఇతర పథకాలకు మళ్లించారని సమాచారం. 6 నెలల క్రితం డబుల్ రోడ్డు స్టేజ్-2 పనుల్లో భాగంగా కొత్త ధరల ప్రకారం రూ.80 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

\- లక్ష్మి, ఆర్‌అండ్‌బీ జేఈ, శింగనమల

బెట్టింగ్ ఆడారో...

కఠిన చర్యలు తప్పవు: ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. ఐపీఎల్ సీజన్ శనివారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా క్రికెట్ బెట్టింగ్‌లకు తావు లేకుండా ప్రజలు సహకరించాలని కోరారు. అమాయక ప్రజలు, యువతను లక్ష్యంగా చేసుకొని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. క్రికెట్ బెట్టింగులతో సంబంధాలున్న పాత నేరస్తులను కూడా బైండోవర్ చేస్తామన్నారు. యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా, మంచిగా చదువుకోవాలని సూచించాలన్నారు. ఒకసారి కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనమవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాలు కూడా రావనే విషయాలను తెలియజేయాలన్నారు. శ్రమించకుండా వచ్చే డబ్బు వెనుక అనేక నష్టాలు, కష్టాలు దాగి ఉంటాయని యువత గుర్తెరగాలన్నారు. బెట్టింగ్ వెబ్‌సైట్స్, యాప్స్‌పై నిఘా వేశామన్నారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112/100కు లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేయాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న న్యాయాధికారి రాజ్యలక్ష్మి

రాప్తాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలని జిల్లా పోక్సో కోర్టు న్యాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లిలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో 'లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ' చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ, అనేక చోట్ల బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని అన్నారు. అలాంటి సంఘటనలు ఎక్కడ జరిగినా బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, దోషులను కోర్టు శిక్షిస్తుందని అన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేసిందని అన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలకు తల్లితండ్రులు విలువలు నేర్పించాలని సూచించారు. మహిళల ఒంటిపై ఉన్న బంగారాన్ని దొంగలు లాక్కెళుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీనయ్య, తహసీల్దార్ విజయకుమారి, సీఐ శ్రీహర్ష, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, ఏపీఎం సునీత, సూపర్‌వైజర్ నాగరత్న పాల్గొన్నారు.

శరవేగంగా హంద్రీనీవా విస్తరణ



కసాపురం వద్ద మట్టి కట్ట తొలగింపు పనులు

పనులు పునఃప్రారంభం..

మాట నిలుపుకున్న చంద్రబాబు

జూన్ 12లోగా పూర్తి చేయాలని లక్ష్యం

గుంతకల్లు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రకటించిన విధంగానే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను రాష్ట్ర ప్రభుత్వం పునఃప్రారంభించింది. నీటి ఎత్తిపోతలు నిలిచిన వెంటనే ఈ పనులను ప్రారంభించేలా ప్రభుత్వం జలవనరుల శాఖను సమాయత్త పరిచింది. మరో 20 రోజులపాటు నీటిని పారించే అవకాశం ఉన్నా, పంటలన్నీ పూర్తి కావడంతో ఎత్తిపోతలను గత వారంలో నిలిపివేసింది. విస్తరణ పనులను జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తామని, పూర్తి స్థాయిలో సాగునీటిని పారిస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులకు శ్రీకారం చుట్టారు. జూన్ 12 నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా

(తరువాయి 6లో)

పది పరీక్షలకు 11 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు 99.76 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. శనివారం సంస్కృతం, ఇతర కాంపోజిట్ పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 4,574 మందికిగాను 4,563 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు ఇద్దరికి ఇద్దరు హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 20 కేంద్రాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 4 కేంద్రాలను తనిఖీ చేశాయి.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

ప్రతి రైతూ నీటికుంటను ఏర్పాటు చేసుకోవాలి : కలెక్టర్ వినోద్‌కుమార్



నీటికుంట పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కూడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎకరాల పొలం ఉన్న ప్రతి రైతూ పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జాతీయ జల దినోత్సవం సందర్భంగా కూడేరు మండలం జయపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి పొలంలో ఉపాధి హామీ పథకం కింద నీటికుంట పనులను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పొలంలో నీటికుంట నిర్మాణం చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. పొలంలో నీటికుంట నిర్మిస్తే భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి శాతం వృద్ధి చెందుతుందని అన్నారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో కన్నీరే మిగులుతుందన్నారు. డ్వామా పీడీ సలీంబాషా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా జూన్ నాటికి తొమ్మిదివేల నీటికుంటలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ఏపీడీ విజయ్‌కుమార్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, డీటీ దబ్బర ప్రసాద్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ తులసీప్రసాద్, ఏపీఎం దేవానంద, సర్పంచు రమాదేవిరాజు, ఈఓఆర్‌డీ రాధాకృష్ణ, టీడీపీ నాయకులు మురళి, రాజు, చంద్రబాబు, వన్నూరప్ప, నాగభూషణం, మర్రిస్వామి, సంగప్ప, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆగిన పల్లె పండుగ..!

- బిల్లులు రాక నిలిచిన పనులు
- సీసీ రోడ్లవే రూ. 2.64 కోట్లు పెండింగ్
- అసంపూర్తిగా గోకులాలు
- నిధులు రాక కాంట్రాక్టర్ల లబోదిబో



కొళగాన హళ్లిలో నిర్మించిన సీసీరోడ్డు

బొమ్మనహాళ్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లులు ఆలస్యం అయ్యాయి. గోకులాల షెడ్లను సొంత నిధులతో ప్రారంభించిన రైతులు కూడా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. మండలానికి రూ. 3.51 కోట్లతో 83 పనులు మంజురయ్యాయి. ఇందులో 82 పనులను పూర్తి చేశారు. గోనేహాళ్ గ్రామంలో ఒక రోడ్డు మాత్రమే పెండింగ్‌లో ఉంది. మండల వ్యాప్తంగా సీసీ రోడ్లకు సంబంధించి రూ. 2.64 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నా యి. ఈ పనులకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు కేటాయిం చారు.

ఆగిన గోకులాలు

రెండునెలలుగా బిల్లులు రాకపోవడంతో గోకులాల షెడ్ల నిర్మాణం ఆపేశారు. సీసీ రోడ్లకు సంబంధించి ఒక్కో పనిని రూ. 3 లక్షల వరకు విభజించి నామినేషన్ ప్రాతిపదికపై కాంట్రాక్టర్లకు అప్పగించారు. వీరంతా చిన్నాచితకా



బొమ్మనహాళ్‌లో అసంపూర్తిగా ఉన్న గోకులం షెడ్డు

కాంట్రాక్టర్లు కావడంతో బిల్లులు రాక లబోదిబోమంటున్నారు. పనులను ఒత్తిడితో పూర్తి చేయించారని బిల్లులు ఇవ్వడంలో అలస్యం చేస్తున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులకు సంబంధించి ఉపాధి హామీ పనుల ద్వారా సమకూరే మెటీరియల్ కాంపోనెంట్ నిధులను వెచ్చిస్తున్నారు. ఈ నిధులు 75 శాతం కేంద్రం, మిగిలిన 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడానికి కొంత జాప్యం కావచ్చు అని అధికారులు అంటున్నారు.

రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు..

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు 14 నుంచి పల్లె పండుగ పేరుతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మెటీరియల్ కాంపోనెట్, ఆర్థిక సంఘం నిధులు ద్వారా బిల్లులు చెల్లించే విధంగా పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు అవసరమో గుర్తించి వాటిని నిర్మించడానికి వీలుగా అంచనాలు సిద్ధం చేసి పంపించారు. రైతుల కోసం గోకులాల షెడ్లను ఈ పథకంలో చేర్చారు. సీసీ రోడ్లు, గోకులాలు షెడ్లకు సంబంధించి మండలంలో రూ.4.22 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించారు. ఇందులో ఇప్పటి వరకు రూ. 85 లక్షలు బిల్లులు మాత్రమే చెల్లించారు. కానీ పూర్తయినా మధ్యలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ఇంకా రూ. 3.35 కోట్లు వరకు బకాయిలు పేరుకుపోయాయి. డిసెంబరు నెలాఖరు వరకు వారం వారం వచ్చిన బిల్లులు ఆ తర్వాత నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లు మాత్రం రోడ్లను పూర్తి చేశారు. రైతులు మాత్రం గోకులాలను అర్ధంతరంగా నిలిపివేశారు. బిల్లులు వస్తేనే తిరిగి చేయగలమంటూ అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. మండల వ్యాప్తంగా 31 గోకులాలు మంజూరు కాగా 12 మాత్రమే పూర్తి అయ్యాయి.

బిల్లులు అప్‌లోడ్ చేశాం



మండలంలో పల్లె పండుగలో భాగంగా రూ. 3.51 కోట్లతో 83 రోడ్లు మంజురు కాగా 82 పూర్తి చేశాం. గోనేహాళ్ గ్రామంలో మాత్రమే ఒక రోడ్డు పెండింగ్ లో ఉంది. రూ. 85 లక్షలు వరకు బిల్లులు చెల్లించాం. రూ. 2.64 కోట్లు రావాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు మొత్తం అప్‌లోడ్ చేశాం.

- జగదీష్, జేఈఈ, పంచాయతీరాజ్, బొమ్మనహాళ్

రైతు ఆత్మహత్యాయత్నం

సర్వేయర్ బెదిరింపులే కారణమా..?



బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

బత్తలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విలేజ్ సర్వేర్ బెదిరించాడని మండలంలోని దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణస్వామి శనివారం పు రుగులు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన మేరకు దంపేట్ల గ్రామానికి చెందిన నారాయణ స్వామికి అదే గ్రామములో సర్వే నెంబర్ 348లో 2.4 ఎకరాల పొలం ఉంది. అందులో బోరు వేసుకుని మొక్కజొన్నసాగు చేశాడు. నారాయణస్వామి శనివారం తన పొలానికి కంచె వేస్తుండగా సర్వేర్ రవి కిరణ్ ఫోన్ చేసి నువ్వు కంచె వేస్తే పోలీస్ కేసు పెట్టి నీకు భూమి లేకుండా చేస్తానని బెదిరించాడు. ఎందుకు వేయకూడదు అని ప్రశ్నించగా బోరుబావి ఉన్నప్రాం తం వేరే రైతుకు పోతుంది అని సర్వేయర్ చెప్పాడు. దీంతో రైతు ఇప్పటికే 5సార్లు కొలతలు వేశారు. నాభూమిలో ఉన్న బోరు వేరేవాళ్లకు పోతే నేను ఎలా బతకాలి నాకు చావే శరణ్యం అంటూ పురుగుల మందు తాగా డు. గమనించిన తల్లి సంజ మ్మ, చుట్టు పక్కల రైతుల సాయంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వై ద్యం కోసం బెంగళూరుకు తరలించారు. ఆర్డీటీ ఆసుపత్రికి వెళ్లి విచారించగా బెంగళూరుకు తరలించినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారని ఎస్ఐ సోమశేఖర్ తెలిపాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదన్నారు. విలే జ్ సర్వేయర్ అనవసరంగా సమస్య లు సృష్టించి డబ్బు లు డిమాడ్ చేస్తున్నాడని గ్రామస్థులు ఆ రో పిం చారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

అనంతపురం-ఉరవకొండ రహదారిలో తరచూ ప్రమాదాలు

- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- వాహనాల వేగ నియంత్రణకు చర్యలేవీ?

కమ్మూరు వద్ద రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో (ఫైల్)



కూడేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. తరచూ ప్రమాదాలు జరిగి.. ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడి మంచాలకే పరిమితమవుతున్నారు. ప్రమాదాలకు నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రధాన కారణమని పోలీసుల విచారణలో తేలుతోంది. అతివేగంతో వాహనాలు దూసుకొస్తున్నాయి. అదుపు చేయలేక ఢీకొంటున్నట్లు ప్రమాదాల తీరును బట్టి తెలుస్తోంది. అయినా వాహనాల వేగ నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించట్లేదు.

ప్రమాదకర మలుపులు

అనంతపురం నగర శివార్ల నుంచి పెన్నహోబిలం వరకు 30 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ ప్రాంతంలోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి, కమ్మూరు, అరవకూరు చెరువుకట్ట, కూడేరు సమీపంలోని శివారెడ్డి తోట, ముద్దలాపురం, జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట గ్రామాల వద్ద మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. కూడేరు, ముద్దలాపురం మధ్యనున్న శివారెడ్డి తోట వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీసులు ఆ ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఒకేచోట రెండు, అంత కంటే ఎక్కువ ప్రమాదాలు జరిగితే పోలీసులు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సూచికలు ఏర్పాటు చేస్తారు. ఈ రహదారిలో ఏకంగా 8 ప్రమాదకర మలుపులను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.



ఉదిరిపికొండ గ్రామం వద్ద మలుపు

ఇటీవలి రోడ్డు ప్రమాదాల్లో కొన్ని..

- 2023వ సంవత్సరంలో కమ్మూరు గ్రామ సమీపంలోని ఐశ్వర్య వెంచర్ వద్ద ద్విచక్రవాహనంలో వస్తున్న ముగ్గురు యువకులు దున్నపోతును ఢీకొన్నారు. ఇద్దరు మరణించారు.
- ముద్దలాపురం గ్రామ సమీపంలోని శివారెడ్డి తోటవద్ద ద్విచక్రవాహనం, బస్సు ఢీకొనడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- 2024 అక్టోబరులో శివరాంపేట సమీపంలోని క్రాస్ వద్ద ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంలో వెళ్తూ కారును ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు.
- ఈ నెలలోనే కమ్మూరు గ్రామ సమీపాన ఆటోను కారు ఢీకొట్టడంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లతోపాటు, మూడు నెలల చిన్నారి మృతి చెందారు. ఈ ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకిరువైపులా గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంతోపాటు కమ్మూరు, అరవకూరు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, శివరాంపేట తదితర గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయాలి. వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలి. మలుపులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో ప్రమాద సూచికలతోపాటు వేగం తగ్గించే చర్యలు తీసుకోవాలి.

- కృష్ణమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రమాదాల నియంత్రణకు చర్యలు



అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నాం. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే కఠినంగా వ్యవహరిస్తాం. రోజూ వాహన తనిఖీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నాం. ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణే లక్ష్యం.

- రాజు, సీఐ, కూడేరు అప్‌గ్రేడ్ స్టేషన్

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 120 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ దర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా విస్తరణ



జి. కొట్టాల వద్ద కాలువలో నీటిని మోటార్లతో తోడేస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

ముందుకు సాగుతున్నారు.

ఇదీ నేపథ్యం.. కర్నూలు జిల్లా మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. హంద్రీనీవా కాలువను వెడల్పు చేస్తామని 2017లో పామిడిలో ఏర్పాటుచేసిన సభలో చంద్రబాబు ప్రకటించారు. అప్పట్లో 90 రోజుల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా టార్గెట్ ఇచ్చినా సాధ్యపడలేదు. 2019 ఎన్నికల నాటికి మట్టిపనులు 50 శాతం పూర్తికాగా, మట్టికట్టలు, సిమెంటు లైనింగ్ పనులను చేపట్టలేకపోయారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో పనులు అటకెక్కాయి. హంద్రీనీవా కాంట్రాక్టులన్నింటినీ జగన్ రద్దు చేయించారు. 2023లో లైనింగ్‌తో వైడెనింగ్ చేపడతామని ప్రకటించి టెండర్లు నిర్వహించారు. కానీ పనులు చేపట్టలేదు. 2024 ఎన్నికల అనంతరం చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే వైడెనింగ్‌కు కసరత్తు ప్రారంభించారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు లక్ష్యంగా ఉన్న 3,850 క్యూసెక్కుల నీరు పారేలా వెడెల్పు చేయడానికి అంచనాలు వేయించారు. రూ.400 కోట్లతో టెండర్లను నిర్వహించారు. వీపీఆర్ సంస్థ పనులను దక్కించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగమేఘాలపై పనులకు శ్రీకారం చుట్టింది

90 రోజుల టార్గెట్ వచ్చే ఖరీఫ్ ఆరంభమయ్యేలోగా విస్తరణ పనులు పూర్తి కావాలన్న లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ రంగంలోకి దిగింది. మల్యాల నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ 216 కి.మీ. మేర అడుగడుగునా మిషనరీని దించి కార్యాచరణ చేపట్టింది. గ్రావిటీ కంటే కింద నీరు పారేచోట కాలువ పనులు ఆలస్యమైనా ఫర్వాలేదు, నేలకు సమాంతరంగా నీరు పారే చోట్ల నిర్మించిన మట్టికట్ట పనులు ఎట్టిపరిస్థితుల్లోనూ 90 రోజుల్లో పూర్తిచేయడానికి రంగం సిద్ధంచేశారు. జిల్లాలో హంద్రీనీవాకు కసాపురం, జీ కొట్టాల, రాగులపాడు పంప్ హౌస్ వద్ద, ఎన్ఎస్‌పీ తాండా సమీపంలో ఉన్న మట్టికట్టల తొలగింపు కార్యక్రమాన్ని తొలుత చేపట్టారు. భూమికి సమాంతరంగా నీరుపారే చోట్ల మట్టికట్టలను తొలగించిన తర్వాత పనులు పూర్తికాకపోతే హంద్రీనీవాలో నీరు పారడం సాధ్యంకాదు. కనుక మట్టికట్టల పనులను తొలుత చేపట్టి, త్వరగా పూర్తిచేయడానికి చర్యలు చేపట్టారు. హంద్రీనీవా కాలువ కుడి గట్టు (ఉత్తరం వైపు గట్టు) మాత్రమే తొలగించి కాలువను వెడెల్పు చేసే పనులను ప్రారంభించారు. మార్కింగ్ చేయడానికి తొలుత జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. కసాపురం సమీపంలో కాలువ గట్లపై కంప చెట్లను తొలగించడం పూర్తికావడంతో ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వగా బండ్ తొలగింపును ప్రారంభించారు. జి.కొట్టాల తదితర ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ జరుగుతోంది.

వేగంగా డీ వాటరింగ్ నీటిపారుదల ఆగిపోయినా రాగుల పాడు పంప్‌హౌస్ నుంచి దిగువకు నీరు నిలిచి ఉంది. ఆ నీటిని తరలిస్తే తప్ప గట్టును తొలగించడానికి సాధ్యపడదు. దీంతో నిల్వ ఉన్న నీటిని తోడే పనులను చేపట్టారు. కసాపురం తూముకు సమీపంలో కుడి వైపు గట్టును తెంచి నీటిని వంకలోకి వదులుతున్నారు. జి.కొట్టాల వద్ద మోటార్లను బిగించి నీటిని బయటకు తోడేస్తున్నారు. కసాపురం వద్ద జంగిల్ క్లియరెన్సు, డీవాటరింగ్ పూర్తి కావడంతో ఎక్స్‌కవేటర్లతో బండ్ షిఫ్టింగ్ చేపట్టారు. ప్రస్తుతం కాల్వ 9.5 అడుగుల బెడ్ ఉండగా, దాన్ని కొన్ని చోట్ల అదనంగా 6 అడుగుల వెడెల్పు, మరికొన్ని చోట్ల అదనంగా 8 అడుగుల వెడెల్పుచేస్తారు. వంతెనలు, స్లూయిజ్ చానల్ స్ట్రక్చర్స్ ఉన్నచోట్ల కాలువను వెడెల్పు చేయరు. 2005లో హంద్రీనీవాను 3,850 క్యూసెక్కుల నీరు పారేలా డిజైన్ చేశారు. కానీ కాలువ సామర్థ్యం అందుకు తగినవిధంగా లేదు. విస్తరణ పనులు పూర్తయితే.. పూర్తి సామర్థ్యంతో నీరు పారుతుంది.

నదిలోకి నిధులు..!

వైసీపీ హయాంలో స్వాహాపర్వం

ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై నిర్మించిన వంతెన. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువపై ఈ వంతెన నిర్మించారు. సైడ్ వాల్స్ నాణ్యంగా కట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు.



- పెన్నానది వంతెనల మరమ్మతుల్లో నాణ్యతకు తిలోదకాలు
- సైడ్ వాల్స్ కట్టకుండా దిమ్మెలతో సరి..
- అవి కూడా.. పడిపోయిన దుస్థితి
- రెండు వాహనాలు ఒకేసారి వెళ్లడానికి ఇబ్బంది
- ఎదురుగా వాహనం వస్తే బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- ప్రమాదపుటంచున ప్రయాణాలు
- తరచూ ప్రమాదాలు



ఇది పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ఉన్న వంతెన. 2022లో నదికి భారీ వరద రావడంతో నదిలోని ఈ రహదారిలో రెండు వంతెనలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండు వంతెనల మరమ్మతులు, రోడ్డులో అక్కడక్కడా ప్యాచ్ వర్కులు చేసింది. ఇందుకోసం ఏకంగా రూ.3.15 కోట్లు ఖర్చు చేసింది. వంతెనల కింద పిల్లర్లకు కనీసం ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుపై చేసిన ప్యాచ్ వర్కులు అప్పుడే దెబ్బతిన్నాయి. ఈలెక్కన నాసిరకంగా పనులు చేశారని స్పష్టమవుతోంది. కోట్ల రూపాయల నిధులు ఏం చేశారో, ఎవరు కాజేశారో అంతుచిక్కని విషయంగా మారింది.



పామిడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామిడి-కల్లూరు మధ్య పెన్నానదిపై ప్రయాణమంటే వాహనదారులు హడలెత్తుతున్నారు. వంతెనలు మరీ ఇరుకుగా ఉన్నాయి. ఎదురుగా వాహనం వచ్చిందంటే దాటుకోవడం చాలాకష్టం. కనీసం అంచుల్లో సైడ్‌వాల్స్ కూడా లేవు. అక్కడక్కడా పిల్లర్లు కట్టినా వాటిలో చాలావరకు ధ్వంసమయ్యాయి. దీంతో అంచుల్లో వాహనదారులు ఏమాత్రం ఆదమరచినా ప్రమాదం తప్పదు. భయంభయంగా ప్రయాణిస్తున్నారు. వైసీపీ హయాంలో చేపట్టిన వంతెనల మరమ్మతు పనులు కాంట్రాక్టర్‌కు కాసుల వర్షం కురిపించినా.. ప్రయాణికులకు మాత్రం ప్రాణసంకటంగా మారాయి. తూతూమంత్రంగా పనులు చేపట్టి రూ.కోట్లాది ప్రజాధనాన్ని దోచుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పెన్నానది వంతెనలపై ప్రమాదాల పాపం వైసీపీదేనని దుమ్మెత్తిపోస్తున్నారు.


పెన్నానదిలో ప్రమాదానికి గురైన కారు



ప్రమాదాల ప్రయాణం

పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) పెన్నానదిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి నెలా ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా వాటి నివారణకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్న పాపానపోలేదు. 2022లో వర్షాలకు పెన్నానది ఉధృతంగా ప్రవహించింది. దీంతో పామిడి-కల్లూరు (బీసీసీ రోడ్డు) ప్రధాన రహదారి పెన్నానదిలోని వంతెనలు శిథిలమయ్యాయి. రోడ్డు ఛిద్రమైంది. పెన్నానదిలోని వంతెనలు, రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అత్యవసర నిధులు రూ.3.15కోట్లు మంజూరు చేశారు. శిథిలమైన వంతెనల వద్ద బెడ్డింగ్ వేసి, పైపులు అమర్చేందుకు ఎనిమిది నెలలు పట్టింది. రోడ్డుపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలపై తారుతో ప్యాచ్ వర్క్ చేసి, చేతులు దులుపుకున్నారు. ఆ ప్యాచ్ వర్కులు మూడు నెలలకే దెబ్బతినడం గమనార్హం. బెడ్డింగ్ వేసి పైపులను అమర్చి ఆ రోడ్డుపై మొక్కుబడిగా దూరదూరంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల ఏమాత్రం భద్రతా చర్యలు చేపట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతపెద్ద వంతెన, రోడ్డుకు భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో ఓ ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ రోడ్డులో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదని జనం బెంబేలెత్తుతున్నారు.

ప్రమాదకరంగా పామిడి పెన్నానది వంతెన



కాంట్రాక్టర్లకు కల్పతరువు

పామిడి-కల్లూరు మధ్య (బీసీసీ రోడ్డు) పెన్నానది వంతెనలు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయని, ఇందుకు వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన మరమ్మతులే నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. వరదనీటి ప్రవాహానికి వంతెనలు పటుత్వం కోల్పోయాయి. వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలు నెర్రెలు ఇచ్చాయి. వంతెనల్లో పలుచోట్ల ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త పేరుకుపోయింది. పలుచోట్ల పూర్తిగా మట్టితో మూసుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఈ వంతెనలు.. కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపించాయని ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. ఇంత అధ్వానంగా ఉన్న వంతెనలకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం శోచనీయం. వరద వస్తే.. మళ్లీ ఛిద్రమవుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పెన్నానదిలో వంతెనల భద్రతను గాలికి వదిలేయకుండా ఈ వేసవిలో పటిష్ఠ పరచాలనీ, మరోసారి ప్రజలు, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వంతెన పనులపై విచారణ చేపట్టాలి



హమాలీ గోపాల్, పామిడివైసీపీ ప్రభుత్వంలో రూ.3.15 కోట్లతో చేపట్టిన పామిడి-కల్లూరు పెన్నానది (బీసీసీ రోడ్డు) వంతెన పనులపై విచారణ చేపట్టాలి. టీడీపీ హయాంలో రూ.48లక్షలతోనే మూడో కాలువ వంతెన నిర్మాణం చేపట్టారు. 2022లో పెన్నానదిలో వరద ఈ వంతెన మీదుగానే ఉధృతంగా ప్రవహించినా ఏమాత్రం చెక్కుచెదరలేదు. వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించినా కనీసం వంతెనల కింద ఉన్న రాళ్ల దిమ్మెలకు ప్లాస్టింగ్ కూడా చేయలేదు. రోడ్డుకు ఇరువైపులా సక్రమంగా సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేయలేకపోయారు. కొన్ని వంతెనలపై వాహనాలు వస్తే పాదచారులు పక్కన నిలబడలేని పరిస్థితి ఉంది. ఈ పనులపై విచారణ చేపట్టాలి.

- హమాలీ గోపాల్, పామిడి



ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తలారి వెంకటేష్ (ఫైల్)

కోలాహలంగా తీర్థవాది

కుంకుమ, గాజులు కొనుగోలు చేసిన మహిళలు

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



తీర్థవాదిలో పాల్గొన్న భక్తులు

కదిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తీర్థవాదిని కోలాహలంగా నిర్వహించారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు ఆలయ ప్రాంగణంలో కొలువుతీరారు. వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు శ్రీవారి వెంట నడుస్తూ రంగులు చల్లుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం అమ్మవార్లను, శ్రీవారిని ఆలయ పడమటి దిక్కున ఉన్న భృగుతీర్థం వద్దకు చేర్చి, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య శ్రీచక్ర స్నానం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ఈఓ వి. శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు. తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చి, యాగశాలలో హోమం అనంతరం శ్రీవారు ఆలయ ప్రవేశం చేశారు. కల్యాణోత్సవం రోజున ధ్వజస్తంభానికి ఆరోహణం చేసిన గరుడ పతాకాన్ని ఈ సందర్భంగా అవరోహణం చేశారు. శ్రీవారి ఆలయ ప్రవేశంతో ప్రధాన ద్వారాలను మూసివేశారు. శనివారం అన్ని రకాల దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం ఉదయం శ్రీవారి దర్శనానికి అనుమతి ఇస్తారు.

తీర్థవాదికి కుంకుమ, గాజులు ప్రత్యేకం

కదిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో కదిరి కుంకుమ, గాజులకు ప్రత్యేకత ఉంది. తీర్థవాది రోజున తిరువీధుల్లో అమ్మే కుంకుమ, గాజులను కదిరి ప్రాంతంలోని ఆడపడుచులు కొనుగోలు చేస్తారు. కుంకుమను సంవత్సరం పొడవునా వాడుకుంటారు. ఇంటికి వచ్చిన ఆడపడుచులకు గాజులు, కుంకుమతో పాటు కదిరి మల్లెలు ఇవ్వడం ఆనవాయితీ.

నేడు పుష్పయాగోత్సవం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం పుష్పయాగోత్సవం జరగనున్నది. దీంతో 15 రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. నిత్య కల్యాణుడైన శ్రీవారికి అన్ని రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతోను యాగోత్సవం నిర్వహిస్తారు. వివిధ పుష్పాలతో యాగోత్సవం నిర్వహించడం ద్వారా స్వామిని ప్రసన్నం చేసుకుంటారు.

ఉమ్మడి జిల్లాలో వడగండ్ల వాన

దెబ్బతిన్న పంటలు



తనకల్లులో వడగండ్ల కుప్ప

తనకల్లు, యాడికి, అనంతపురం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం వడగండ్ల వర్షం కురిసింది. ఈ నెల ఆరంభం నుంచి ఎండలు మడిపోతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకూ నమోదయ్యాయి. దీంతో జనం బయటకు రావాలంటే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి వాతావరణంలో శనివారం సాయంత్రం అనూహ్యంగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై.. ఒక్కసారిగా చల్లటిగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది.

- తనకల్లు మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటల నుంచి సుమారు అరగంటపాటు వడగండ్ల వాన కురిసింది. పట్టణ శివారులోని రమ్మీ కేఫ్ వద్ద యువకులు వడగండ్లను ఏరి పెద్ద కుప్పగా పోశారు. వడగండ్ల వానకు పంటలు తెబ్బతిన్నాయి. తనకల్లుకు చెందిన ఆంజనేయులు రెండు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట మొత్తం నేలకొరిగింది. కంకి దశలో పంట ధ్వంసం కావడంతో తనకు రూ.3 లక్షల నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తనకల్లుకు చెందిన ఆది రెండు ఎకరాల్లో దబ్బ చిక్కుడు సాగుచేశారు. పూత దశలో ఉన్న పంట మొత్తం ధ్వంసమైంది. పూత రాలిపోయి కొమ్మలు మిగిలాయి. తనకు రూ.రెండు లక్షల నష్టం జరిగిందని ఆది ఆవేదన చెందారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.
- యాడికి మండలం కేశవరాయునిపేట గ్రామంలో శనివారం సాయంత్రం చిన్నపాటి వడగండ్లవాన కురిసింది. యాడికి, రాయలచెరువు తదితర గ్రామాల్లో సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీచాయి. మోస్తరు వర్షం కురిసింది. నాలుగు రోజులుగా మండలంలో ఉష్ణోగ్రతలు 39 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ నమోదయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాతావరణం చల్లబడటంతో జనం ఊరట చెందారు.
- నగరంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు చిమ్మచీకట్లో గడపాల్సి వచ్చింది. పెద్దవడుగూరు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వజ్రకరూరు, యల్లనూరు, పుట్లూరు, తాడిపత్రి, గార్లదిన్నె, కూడేరు, నార్పల మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.



నేలకూలిన మొక్కజొన్న పంటను చూపుతున్న తనకల్లు రైతు ఆంజనేయులు

అభ్యసనం నిరంతర ప్రక్రియ

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థి జక్రియబేగ్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్

అనంతపురం సెంట్రల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అభ్యసనం నిరంతరం ప్రక్రియ అని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తొలి బ్యాచ్ విద్యార్థి, మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్ పేర్కొన్నారు. కళాశాల సి-బ్లాక్‌లో మెగా అలుమ్ని అసోసియేషన్ మీట్-2025ను శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జక్రియబేగ్‌తోపాటు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్రియ బేగ్ మాట్లాడుతూ సాంకేతిక విద్యావ్యవస్థలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. తద్వారా సమాజానికి అవసరమైన ఇంజనీరింగ్ సేవలందించవచ్చునని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు ప్రస్తుత విద్యార్థులకు అందించేలా కృషిచేస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ప్రిన్సిపాల్ జక్రియ బేగ్‌తోపాటు ఇతర ప్రిన్సిపాల్స్‌ను, లెక్చరర్లను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు శ్రీనివాస్‌రావు, ధీరేంద్రబాబు, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, యుగంధర్, అధ్యాపకులు నరసింహులు, మహబూబ్‌బాషా, వెంకట సుబ్బయ్య, సుంకన్న, రాంబాబు, క్రిష్టప్ప, నిత్యలావణ్య, జయశ్రీ, రాధిక, సుధారాణి, సరిత, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నలుగురు అన్నదమ్ములం ఇక్కడే చదివాం



మా ఇంట్లోని ఐదుగురు అన్నదమ్ముల్లో నలుగురు ఇదే కళాశాలలో పాలిటెక్నిక్ చదివాము. మా పెద్దన్న సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కర్నూలులోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో, రెండో అన్న ముంబై భారత్ పెట్రోలియంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, మూడో అన్న బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా సంస్థలో పనిచేస్తున్నారు. నేను 1993నుంచి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నా. ఆ విధంగా కెరీర్‌ను బిల్డ్ చేసుకోవడానికి ఈ కళాశాలలో నేర్చుకున్న బేసిక్స్ చాలా దోహదపడ్డాయి. నాణ్యమైన ప్రమాణాలతో కూడిన ఇంజనీరింగ్ నేర్చుకోవడానికి కళాశాల అవకాశం కల్పించింది.

- రాధాకృష్ణ, పూర్వ విద్యార్థి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

స్నేహపూర్వకమైన ర్యాగింగ్



ఇక్కడ చదువుకునే రోజుల్లో ర్యాగింగ్ బాగా చేశారు. అయితే అది ఇబ్బందికరంగా కాకుండా స్నేహపూర్వకంగా ఉండేది. మా సీనియర్స్ వాళ్ల రూంలో కూర్చోబెట్టి సబ్జెక్టులు చెప్పేవారు. ప్రాజెక్టులు, పరీక్షలు, పైచదువులు ఇలా అన్ని అంశాలను వివరించేవారు. రాష్ట్రంలోని ఐదు పాలిటెక్నిక్ కళాశాలల్లో అనంతపురం కళాశాల ఒకటిగా ఉంది. రాష్ట్రంలో ప్రథమంగా కోర్ బ్రాంచ్‌లు భర్తీ అవుతున్నాయి. ఇక ఆటోమొబైల్ ఇంజనీరింగ్ ఫస్ట్ కాలేజ్. వేలాదిమంది ఇక్కడ చదివి ఉన్నత స్థాయికి వెళ్లాం.

- విజయభాస్కర్, పూర్వ విద్యార్థి, టెక్నికల్ ఎడ్యుకేషన్ స్టేట్ డిప్యూటీ డైరెక్టర్

నిమిషం ఆలస్యమైనా రానిచ్చేవారు కాదు



మానాన్న రామిరెడ్డి మనోరంజన్ 1959లో ఈ కళాశాలలో పాలిటెక్నిక్ చదివి. అనంతరం 30 సంవత్సరాలు ఇంగ్లిష్ లెక్చరర్‌గా ఇక్కడే పని చేశారు. నీరు, చెట్లు అంటే ఆయనకెంతో ఇష్టం. ప్రస్తుతం ఇక్కడ కనిపిస్తున్నవి ఆయన నాటినవే. ఆయన గుర్తుగా దాదాపు రూ.3లక్షల విలువగల రెండు వాటర్ ఫిల్టర్ ట్యాంకులు ఏర్పాటు చేయిస్తున్నా. విద్యార్థిగా నేనూ ఇదే కళాశాలలో చదువుకున్నాను. తరగతి సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా రానిచ్చేవారు కాదు.

- భరత్, పూర్వపు విద్యార్థి

అధినేతలుగా ఎందరో..



ఇక్కడ చదివిన విద్యార్థులు ఎందరో అధికారులుగా, సంస్థల అధినేతలు గా ఎదిగారు. ఇంజనీరింగ్ అంటేనే కంప్యూటర్ అనుకుంటారు. కాని కోర్ బ్రాంచ్‌లైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ వంటి కోర్సులే ఇంజనీరింగ్‌కు పునాదులు. మా బ్యాచ్‌తో పాటు సీనియర్‌లు, జూనియ ర్లు ఎంతోమంది సొంతంగా సంస్థలు ఏర్పాటుచేసి పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. కళాశాల లెక్చరర్లు మాకు ఇంజనీరింగ్‌లో గట్టిపునాదులు వేయడంతోనే సమాజంలో రాణించగలుగుతున్నాం.

- రావి చైతన్య కిశోర్, పూర్వవిద్యార్థి

కోర్ ఫండమెంటల్ ఆఫ్ ఇంజనీరింగ్



పాలిటెక్నిక్ అంటే కోర్ ఫండమెంటల్ ఆఫ్ ఇంజనీరింగ్. క్రమశిక్షణ, అభిమానంతో మాకు అధ్యాపకులు పాఠాలు బోధించేవారు. వారందించిన విజ్ఞానం మా జీవితాలను ఉన్నతస్థితికి తీసుకెళ్లింది. మా నాన్న నారాయణస్వామి సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఈ కళాశాలలో పనిచేశారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఇక్కడే పాలిటెక్నిక్ చదివా. భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ అయిన డీఆర్‌డీఓలో సైంటిస్ట్‌గా ఉన్నా. అక్కడ మిస్సైల్ సిస్టమ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నా. మా నాన్న పనిచేస్తున్న ఈ కళాశాలలో చదివి దేశ అత్యున్నత రంగంలో సేవలందించడం గర్వంగా ఉంది.

- కిశోర్, పూర్వ విద్యార్థి, డీఆర్‌డీఓ సైంటిస్ట్

ఇక్కడి నుంచే పునాదులు



1975-78లో మెకానికల్ బ్రాంచ్ చదివా. పోస్ట్ డిప్లొమా ఇన్ డిజైన్‌చేసి డీఆర్‌డీఓలో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా పని చేశా. ఐజీఎంజీపీలో మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సేవలందించా. అనంతరం పరిశోధన నుంచి ఉత్పత్తి విభాగానికెళ్లా. ఈ కళాశాలలో గట్టి పునాదులు వేయడంతోనే దేశ స్థాయిలో పని చేయగలిగా. కళాశాల పెట్టిన భిక్ష, అధ్యాపకులు అందించిన విద్య అని చెప్పడానిక గర్వంగా ఉంది.

- పవన్, పూర్వ విద్యార్థి, సైంటిఫిక్ అసిస్టెంట్

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

\- జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇతర సభ్యులు

అనంతపురం విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధికారులను ఆదేశించారు. జడ్పీలో శనివారం ఏడు స్టాండింగ్ సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్, అగ్రికల్చర్, విద్య, బీసీ, సోషల్ వెల్ఫేర్ అంశాలపై చర్చ సాగింది. చర్చ సందర్భంగా బుక్కరాయసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ తమ మండలానికి సత్యసాయి వాటర్ సప్లై అవుతోందని, అయితే నీళ్ల రంగు మారడం వల్ల, అన్నం కలర్ మారుతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. గోరంట్ల జడ్పీటీసీ మాట్లాడుతూ గోరంట్ల టౌన్, కొత్తపల్లిలో నీటి సమస్య ఉందన్నారు. నార్పల జడ్పీటీసీ సైతం తాగు నీటి సమస్యను సభ దృష్టికి తీసుకొచ్చారు. కణేకల్లు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో నీటి ఎద్దడి ఉందని జడ్పీటీసీ తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించాలన్నారు. సమయం వృథా చేయకుండా సమస్య మీ దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ నుంచి సీనరేజీ చార్జీలు రూ.96 కోట్లు పెండింగ్ ఉన్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడి నిధులు రాబట్టి జడ్పీ ఖాతాకు జమ చేయాలన్నారు. తర్వాత కంబదూరు, నార్పల, కణేకల్లు తదితర మండలాల్లోని పంచాయతీరాజ్ రహదారుల సమస్యలను జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. కణేకల్లు జడ్పీ హైస్కూల్‌లో గోడ కూలేలా ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని జడ్పీటీసీ తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో కొన్ని స్కూళ్లలో ఎండీఎం సరిగ్గా లేకపోవడంతో 50 శాతం విద్యార్థులు ఇళ్ల నుంచి లంచ్ బాక్సు లు తీసుకెళుతున్నారన్నారు. నాణ్యత పెంచేలా చూడాలని అధికారులను కోరారు. పరిగిలోని ఎస్సీ హాస్టల్ భవనం సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతపురం రూరల్ జడ్పీటీసీ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను పోలీస్‌స్టేషన్లుగా మార్చారని, ఇదేనా రైతులకు ఇచ్చే గౌరవం అంటూ అసహనం వ్యక్తం చేశారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరిగ్గా రావడం లేదన్నారు. ఐసీడీఎస్ పరిధిలో విధులకు డుమ్మా కొట్టే టీచర్లపై చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

\- చిరుధాన్యాల పండుగలో వక్తలు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వపు కలెక్టర్ జనార్దన్‌రెడ్డి

అనంతపురం క్లాక్ టవర్, మార్చి 22(ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మన వ్యవ సాయం, పంటలు, ఆరోగ్యం అనే నినాదంతో ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు సాగే చిరుధాన్యాల పండుగ (మిల్లెట్ ఫెస్టివల్)ను పలువురు విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రైతులు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా పూర్వపు కలెక్టర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో నేలలకు అనుకూలమైన వాటిని పండించడమే కాకుండా పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు స్థానికంగా పండించిన పంటలను తినాలని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి, ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి, జమ్మూకాశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి, ఏపీ మాస్ సీఈఓ సీఎస్ రెడ్డి ప్రకృతి వ్యవసాయంపై తమ అనుభవాలు, ప్రజల ఆరోగ్యంపై ప్రభావాన్ని వివరించారు. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతు సమస్యలకు, ప్రజలకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలన్నింటికీ సహజ వ్యవసాయమే దివ్య ఔషధమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, నాబార్డు సీజీఎం మోహనయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయరామ్, భానుజా, తిరుమల నాయక్, కిష్టప్ప, రమేష్ సుసార్ల పాల్గొన్నారు.

వ్యాపారి నగదుతో డ్రైవర్ పరార్

కంబదూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్లకుంట గ్రామానికి చెందిన వేరుశనగ వ్యాపారి సుధాకర్‌కు చెందిన రూ.5.80 లక్షల నగదును అతడి డ్రైవర్ తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు వ్యాపారి కంబదూరు ఎస్ఐ ప్రవీణ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఐషర్ వాహనంలో ఉన్న నగదును డ్రైవర్ దుర్గప్రసాద్ తీసుకుని పరారయ్యాడని పేర్కొన్నారు. వాహనంలో ఉన్న నగదును గమనించిన డ్రైవర్ నగదును తీసుకొని వేరేవ్యక్తి ద్విచక్రవాహనంలో పరారయ్యాడని తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్ క్రాస్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రూ.10 లక్షల ఆస్తి నష్టం



షార్ట్‌సర్క్యూట్‌తో రెడ్‌క్రాస్‌లో చెలరేగిన మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

అనంతపురం న్యూటౌన్/టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. భవనం నుంచి ఉదయం 8 గంటల సమయంలో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కార్యాలయంలో రికార్డులు, ఫ్రిజ్‌లు ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని స్థానికులు, నిర్వాహకులు చెబుతున్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి లింగమయ్య తెలిపారు. ఈ ప్రమాదంతో రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని రెడ్‌క్రాస్ సంస్థ మేనేజరు మోహన్‌క్రిష్ణ తెలిపారు.

వృద్ధురాలి మృతి

అనంతపురం క్రైం/న్యూటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రెవెన్యూ కాలనీ షిరిడీ నగర్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి లక్ష్మీదేవి(75) అనే వృద్ధురాలు మృతిచెందారు. భవంతి రెండో అంతస్తులో ఆమె ఒక్కరే ఉండటం, లోపల గడియ పెట్టుకోవడంతో కాపాడటం స్థానికులకు సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక శాఖ సహాయ అధికారి లింగమయ్య సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. తలుపులను బద్దకొట్టించి లోపలికి వెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఇంట్లో వస్తువులు కాలిపోవడంతో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. లక్ష్మీదేవి ఆర్డీటీ ఆసుపత్రిలో నర్సుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన వైద్యశాలకు తరలించారు.

సీసీ టీవీ కోర్సులకు ఆహ్వానం

బుక్కపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్‌యాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సీసీ టీవీ ఇన్‌స్టలేషన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ తెలిపారు. శనివారం వారు మండల కేంద్రంలోని డిగ్రీకళాశాలలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఇంటర్, ఐటీఐ, పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు కోర్సు నేర్చుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల యువతి, యువకులు ఆధార్ లింక్ కలిగిన ఫోన్ ద్వారా దరఖాస్తు చేస్తుకోవాలన్నారు. వివరాలకు సిల్క్‌హబ్ కోఆర్డినేటర్ సెల్ నంబర్ 7981541994కు సంప్రందించాలన్నారు.

కార్మికులపై దాడి సహించరానిది

సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

అనంతపురంరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చమటోడ్చి పనిచేసే కార్మిక వర్గంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముప్పేట దాడి చేస్తున్నాయని, ఇది సహించరానిదని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ అన్నారు. మండలంలోని మన్నీల గ్రామ సమీపాన శ్రీకృష్ణా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి శనివారం ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నా రు. అంతకుముందు ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. సమాజంలో కార్మికులను చిన్న చూపుచూస్తున్నారని కొన్ని మీడియా సంస్థలు కూడా కార్పొరేట్ సంస్థలకు వంతు పాడుతున్నాయని ఆవేదన చెందారు. ఆంధ్ర రాష్ట్రంలో తక్కువ వేతనానికి పనిచేయడానికి ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను రప్పిస్తున్నారని ఇక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులకు పనిదొరకడం లేదన్నారు. కాలానుగుణంగా కార్మికులకు హక్కులు, బాధ్యతలు గుర్తు చేస్తూ సమాజానికి తోడ్పాటు అందించేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, నారాయణ స్వామి, మల్లికార్జున, చలసాని రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

నిరాశ మిగిల్చిన అరటి



చిన్న పాటి గాలులకే నేలకొరిగిన చెట్లు, (ఇన్‌సెట్‌లో) నల్లగా మారిన కాయలు

- ఎండలకు మాడుతున్న పంట
- అమాంతం పడిపోయిన ధర
- చెట్లు నేలకొరిగి నల్లగా మారుతున్న కాయలు

శింగనమల మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సిరులు కురిపించిన అరటి సాగు ప్రస్తుతం ఎండ తీవ్రకు బాగా దెబ్బతింటోంది. చెట్టు మీదనే అరటి గెలలు నల్లగా మారుతున్నాయి. ఎండలకు తోడు రాత్రి పూట చిన్న పాటి ఈదురు గాలులకు అరటి గెల బరువు వల్ల చెట్లు నేలకు ఒరిగిపోతున్నాయి. దీంతో పాటు అమాంతం ధరలు పడిపోవడంతో, కాయలను కోసే వ్యాపారులు లేక పోవడం వల్ల అరటి సాగుచేసిన రైతులు రూ. లక్షలు నష్టపోతున్నారు. శింగనమల మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి, నరేష్‌రెడ్డి అనే ఇద్దరు తమకున్న భూముల్లో ఈ సారి చెరో 3.50 ఎకరాల్లో అరటి సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే పంట కోత సమయంలో సరైన ధర లేకపోవడం వల్ల పంట కోసే వ్యాపారులెవరూ ముందుకు రాకపోవడంతో ఆ రైతులు దిక్కులు చూస్తున్నారు. పంట సాగు కోసం ఒక్కొక్కరు దాదాపు రూ. ఆరు లక్షలు ఖర్చు పెట్టినట్లు వారు తెలిపారు. అయితే పంట కోత సమయంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితం గా చెట్లు ఎండిపోతున్నాయి. కాయల నాణ్యత లోపించింది. దంతో పాటు అరటిగెల బరువు ఎక్కువ కావడంతో ఎండకు రాత్రి సమయంలో చిన్న పాటి గాలులకే అరటి చెట్లు నేలకు ఒరుగుతున్నాయి. దీంతో గెల నేలను తాకి కాయలు నల్లగా మారుతున్నాయి. ధరలు లేకపోవడం, కాయలు నల్లగా మారడంతో వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. సాధారణంగా అరటి పంట జనవరి నెల నుంచి చేతికి వస్తుంది. జనవరి,ఫిబ్రవరి నెలల్లో టన్ను ధర రూ. 25 వేలు పలికింది. ప్రస్తుతం రూ.10 వేలు కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కోత సమయంలో ధర లేదు



నేను మెదటి సారి 3. 50 ఎకరాల్లో అరటి సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగానే వచ్చింది. దీంతో ఖచ్చితంగా లాభసాటిగానే ఉంటుందని ఆశ ఉండేది. తీరా పంటకోత సమయంలో చెట్లు నేలకు ఒరగడంతో పాటు ధర టన్ను రూ.10 వేల లోపై ఉండడంతో వ్యాపారులు ఎవరూ రావడం లేదు. దీంతో తోటలోనే కాయలను వదిలేసే పరిస్థితి ఏర్పడింది. పెట్టుబడుల కోసం రూ. 6 లక్షలు పైగా ఖర్చు చేశా. కనీసం రూ. లక్ష అయినా వస్తుందో, లేదో దిక్కు తోచడంలేదు. అరటి సాగు నష్టాలనే మిగిల్చింది.

\- విశ్వనాథ్‌రెడ్డి, రైతు, నిదనవాడ

పెట్టుబడులు దక్కని పరిస్థితి



ఈ ఏడాది నాకున్న 3.50 ఎకరాల్లో అరటి సాగు చేశా. పెట్టుబడుల కోసం రూ.5 నుంచి 6 లక్షల వరకు పెట్టుబడులు పెట్టా. అయితే అమాంతం ధరలు పడిపోయాయి. టన్ను రూ. 25వేల నుంచి రూ.10 వేలకు పడిపోవడంతో కాయలు కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఎవరు రావడంలేదు. దీంతో పాటు గెల బరువుకు అరటి చెట్లు నేలకు ఒరిగి కాయలు నల్లగా మారిపోతున్నాయి. పూర్తి స్థాయిలో నష్టపోతున్నాం. కొన్ని రోజులు చూసి పంటను వదిలేస్తాం.

\- నరేష్‌రెడ్డి, రైతు, నిదనవాడ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఎండల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. దూర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాపారులు మొగ్గుచూపడం లేదు. జనవరి ఫిబ్రవరి నెలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ కంపెనీలు పంటలు కొనుగోలు చేయడంతో ధరలు ఆశాజనకనంగా ఉండేవి. ప్రస్తుతం స్థానిక మార్కెట్లకు మాత్రమే పంట తరలించే పరిస్థితి ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

\- శైలజ, ఉద్యానశాఖాధికారి

న్యూస్ బాక్స్

నీటి వినియోగంపై అవగాహన అవసరం

● డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) :నీటి వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. న్యాయాధికారి శివప్రసాద్ హాజరై మాట్లాడుతూ... జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వివరించారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వ కేంద్ర సభ్యుడు, న్యాయవాది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం

అనంతపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ హాజరై మాట్లాడారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆయన చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, గోవర్థన్, సూర్యతేజ, భానురేఖ, ప్రకాష్ విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

శింగనమలం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులగుడ్డం గ్రామంలో ప్రసిద్ధి చెందిన శివాలయం, ఆంజనేయ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కొత్త గుడి నిర్మాణం కోసం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బీరు గురుప్రసాద్ నాయుడు రూ.1,11,016 అందజేశారు. అలాగే గుడి నిర్మాణానికి ఆదే గ్రామానికి చెందిన అదెన్న ఎకరా, సూర్యనారాయణ ఎకరా భూమి విరాళం ఇచ్చారు. గ్రామస్థులు దాసరి వెంకటరమణ, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఎస్కేయూ విద్యార్థి



డాక్టర్ బత్తల అశోక్

అనంతపురం సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో నిర్వహించనున్న బోయ భీమన్న జీవితం-సాహిత్యం జాతీయ సదస్సుకు ఎస్కేయూ పోస్ట్ డాక్టరేట్ ఫెలోషిప్ రీసర్చ్ విద్యార్థి డాక్టర్ బత్తల అశోకుమార్ హాజరు కానున్నారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ నుంచి ఆహ్వానం అందినట్లు ఆహ్వానం పంపారని అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

27న ఎంపీపీ ఎన్నిక

రామగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎంపిక ఈనెల 27న జరగనున్నట్టు ఎంపీడీఓ చంద్ర మౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకాధికారి సంజీవయ్య పర్యవేక్షణలో ఎన్నిక జరుగుతుందన్నారు. రామగిరి ఎంపీపీగా ఉన్న నాగమ్మ గత ఏడాది డిసెంబరు 30న మృతి చెందడంతో వైస్ ఎంపీపీ కర్రెన్న ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ నెల 27న నూతన ఎంపీపీని ఎన్నుకోనున్నారు. జనరల్ మహిళకు ఎంపీపీ రిజర్వు అయింది. ఎన్నిక 27న ఉదయం 10గంటలకు నామినేషన్ స్వీకరణతో ప్రారంభమవుతుందన్నారు.

విద్యుదాఘాతంతో గుజిరీ వ్యాపారి మృతి

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) :నగర శివారులో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సిండికేట్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అలీ(32) సమీపంలో తన బంధువులతో కలిసి గుజిరీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 7గంటల సమయంలో విద్యుత్ వైర్ల సాయంతో లోపల పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అలీ విద్యుదాఘాతానికి గురికాగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఆమె ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 20వ తేదీ ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం గాలించిన కుటుంబసభ్యులు ఆచూకీ తెలియకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్‌ఎంహెచ్‌ఎస్‌కు రూ.3లక్షల ఫర్నిచర్ అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు తన ఔదార్యం చాటుకుంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ. 3లక్షలు విలువ చేసే పర్నిచర్, కం ప్యూటర్ల తదితరాలను శనివారం స్థానిక రాజేంద్ర నగరపాలక హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయురాలు రేణుకకు కెనరాబ్యాంకు డీజీఎం టీఆర్ బాలాజీరావు, ఏజీఎం లారెన్స్, చీఫ్ మేనేజర్ శ్రీనాథ్ నాయక్ చేతుల మీదుగా అందజేశారు. రూ.3లక్షలు విలువ చేసే ఫర్నీచర్, మౌలిక వసతుల సామాగ్రి, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ల్యాబ్ పరికరాలను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరాబ్యాంకు మేనేజర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



అబ్దుల్ షఫి మృతదేహం

గార్లదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ని కల్లూరు ఆర్ఎస్ గ్రామంలో శుక్రవారం రాత్రి అబ్దుల్ షఫి (47) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరు ఆర్ఎస్ లో అబ్దుల్ షఫి, బస్సురుణి దం పతులు నివాసం ఉంటున్నారు. అబ్దుల్ షఫి కల్లూరు లోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తుండేవాడు. బస్సురుణి ఇంట్లో టైలరింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. అతడు మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం మద్యం తాగి భార్యతో గొడవప డ్డాడు. దీంతో ఆమె కుమారుడిని తీసుకు ని పుట్టింటికి వెళ్లిపో యింది. అతడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఘటన స్థలానికి చేరుకుని అబ్దుల్ షఫి ఆత్మహత్యపై ఆరా తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కలుషిత నీరు తాగి 20 గొర్రెల మృతి

కనగానపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపకుంట గ్రామంలో శనివారం కలిషిత నీరు తాగి 20 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన దివిటి ఈశ్వరయ్య గొర్రెలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. నీరు తాపేందకు సమీపంలోని మహిళా రైతు కవితమ్మ బోరుబావి వద్దకు తీసుకెళ్లాడు. ఆ బోరు బావి నుంచి వచ్చిన నీటిని కొన్ని గొర్రెలు తాగాగా, మరికొన్ని అక్కడే తొట్టిలో ఉన్న నీరు తాగాయి. తొట్టిలోని నీరు తాగిన కొద్దిసేపటికే దాదాపు 20 గొర్రెలు మృతిచెందాయి. ఆ నీటిలో డ్రిప్పు మందులు కలిసి ఉండడంతో గొర్రెలు మృతి చెందాయని బాధిత కాపరి, స్థానికులు తెలిపారు. రూ 3 లక్షలు నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు.

ఎంపీ అంబికాకు బేడ, బుడగ జంగాల కృతజ్ఞతలు



ఎంపీ అంబికాకు కృతజ్ఞతలు తెలుపుతున్న బేడ, బుడగ జంగం నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలని కేంద్రానికి సిఫార్సు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఆ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. బేడ, బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు శిసిసాల అంజి, శిసిసాల మల్లికార్జున, నారాయణస్వామి, కుళ్లాయప్ప, సురేష్, రమేష్ శనివారం ఎంపీ అంబికాకు నగరంలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌కు పరామర్శ



మంత్రి ఫరూక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ వెళ్లి పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

● మండల సమావేశంలో ఎంపీడీఓ

అనంతపురంరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ దివాకర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీడీఓ దివాకర్, వైస్ ఎంపీపీ బాలాజీ, జడ్పీటీసీ చంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, చియ్యేడు, అనంతపురం రూరల్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నట్లు సంబంధిత స్థానిక ప్రజాప్రతినిధులు మండల అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ఇందుకు అనంతసాగర్ కాలనీ సమీపంలో సీపీడబ్ల్యూ స్కీం కింద బోర్లు వేసి ఆయా ప్రాంతాలకు నీరందించాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తరగతులను విలీనం చేయాలని కోరారు. నాడు-నేడు కింద నిలిచిపోయిన పాఠశాల భవనాలను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నాసా పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం

అనంతపురం విద్య, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నాసా పోటీ పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారని ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య స్కూల్ లో శనివారం ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు.

ఎన్‌ఈపీకి అనుగుణంగా బీటెక్ పాఠ్యాంశాలు: వీసీ

అనంతపురం సెంట్రల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)కి అనుగుణంగా బీటెక్ ఇంజనీరింగ్‌లో పాఠ్యాంశాలను మార్పులు చేస్తున్నట్లు జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. శనివారం వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీఓఎస్) ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పాఠ్యాంశాలను 2023లో మార్పు చేశామని, 2025-26కు సంబంధించి తృతీయ, నాల్గవ సంవత్సరాలకు మార్పులు చేస్తున్నామని తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం

● సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి గీతావాణి



యర్రోనిపల్లిలో మాట్లాడుతున్న న్యాయాధికారి గీతావాణి

చెన్నేకొత్తపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బాలలను, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ధర్మవరం సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి గీతావాణి పేర్కొన్నారు. మండలంలోని యర్రోనిపల్లిలో శనివారం ఆర్డీటీ, ధర్మవరంలీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీలకుమారి, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వీవీ హరీశ్, రామగిరి సీఐ శ్రీధర్, న్యాయవాదులు బాలసుందరి, చరణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● జిల్లా కోర్టు న్యాయాధికారి హరిత

ఆత్మకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు న్యాయాధికారి హరిత పేర్కొన్నారు. మండలంలోని వై కొత్తపల్లిలో శనివారం మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయాధికారి హరిత హాజరై మహిళా చట్టాలు తదితర పలువిషయాలును వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మనరసింహ, ఎంఆర్ఓ లక్ష్మీనాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టలపై అవగాహన ఎంతో అవసరం

● అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి నిర్మల

గార్లదిన్నె, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనంతపురం సబ్ కోర్టు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి నిర్మల తెలిపారు. శనివారం కొప్పలకొండ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి హాజరై మహిళలకు ఉన్న చట్టాలు తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో కొల్లేరు జట్టు హ్యాట్రిక్

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీల్లో కొల్లేరు జట్టు హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీలు మూడోరోజు శనివారం కొనసాగాయి. డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మూడో రోజు పోటీల్లో నల్లమల జట్టుపై తుంగభద్ర జట్టు 3 గోల్స్ తేడాతో విజయం సాధించగా, విశాఖపై గోదావరి 3 గోల్స్, వంశధార జట్టుపై కొల్లేరు 3గోల్స్, పెన్నాపై కోరమాండల్ 2గోల్స్ తేడాతో విజయం సాధించాయి. కొల్లేరు ఆటగాడు అజయ్ ఏకంగా 3గోల్స్ చేసి జట్టు హ్యాట్రిక్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో ఎమ్మెల్యే రాజు కీలక పాత్ర'



ఎమ్మెల్యే ఎంఎస్ రాజును సన్మానిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో, మండలిలో ఆమోదం పొందేందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కీలక పాత్ర పోషించారని ఎంఈఎఫ్ నాయకులు అభినందించారు. శనివారం ఆ సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యేకి నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్, ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరప్ప, గంగాధర్, అమర్ నాథ్, హనుమంతరావు, రమేష్, చంద్రశేఖర్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన జేసీ



ఈవీఎంల రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ

అనంతపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని పాత ఆర్డీఓ కార్యాలయం ఆవరణంలో ఉన్న గోదాములలో భద్రపరిచిన ఈవీఎంలను జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ శనివారం తనిఖీ చేశారు. అధికారులు, రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో తలుపులు తీయించి ఈవీఎంలను పరిశీలించారు. అక్కడ ఎన్నిఉన్నాయి? వాటి భద్రత? తదితర విషయాలపై ఆరాతీసారు. లాక్‌బుక్‌లను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయరాదని అధికారులను జేసీ ఆదేశించారు. అనంతరం అందరి సమక్షంలో తలుపులు వేయించి సీజ్ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సెక్షన్ ఆఫీసర్ యుగేశ్వరి, తహసీల్దార్ హరికుమార్, డీటీ కనకరాజు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు,

శ్రీరామ ఉత్సవ సమితి ఏర్పాటు

అనంతపురం కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామ ఉత్సవ సమితిని ఏర్పాటు చేశారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కుర్లపల్లి రంగాచారి, హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీదుల జగదీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్సవ సమితి కన్వీనర్‌గా దూపకుంట్ల శబరి వరప్రసాద్, కోకన్వీనర్లుగా గల్లా హర్ష, విశ్వనాథరెడ్డి, కోశాధికారిగా హితేన్ జైన్‌ను ఎంపిక చేశారు. సభ్యులుగా వీబీ రవికుమార్, బేకరి శ్రీనివాసులు, అజేష్ యాదవ్, అట్టి నరేంద్ర, బొబ్బా కిషోర్ నాయుడు, మల్లికార్జున, తోట సూర్య ప్రకాష్‌ను ఎంపిక చేశారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏప్రిల్ 6వ తేదీన నగరంలో నిర్వహించనున్న భారీ బైక్‌ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ర్యాలీలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రంగాచారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాఘవేంద్ర, హిమకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెయ్యి మందికి రంజాన్ తోఫా పంపిణీ

● విశ్రాంత ఎస్పీ షెక్షావలి

అనంతపురం కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్క రించుకుని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక లలితకళా పరిషత్‌లో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు విశ్రాంత ఎస్పీ షెక్షావలి పేర్కొన్నారు. పరిషత్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దాదాపు వెయ్యి కుటుంబాలకు ఇప్పటికే టోకెన్లు జారీ చేశామన్నారు. ఆదివారం చేపట్టే తోఫా పంపిణీ కార్యక్రమానికి జిల్లా ప్రజాప్రతినిధులు ముఖ్యఅతిథులుగా హాజరై నిరుపేద ముస్లిం కుటుంబాలకు తోఫా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, సామాజిక కార్యకర్త జాకీర్ హుస్సేన్, రాజకుళ్లాయప్ప, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం'



సర్వే కరపత్రాలు విడుదల చేస్తున్న సరిపూటి రమణ, సచివాలయ సిబ్బంది

అనంతపురం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ పేర్కొన్నారు. స్థానిక 38, 39వ సచివాలయాల్లో శనివారం పీ-4 సర్వేపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిపూటి రమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టీడీపీ నాయకులు రజాక్, సరిపూటి శ్రీకాంత్, గోవింద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 24వేలు

అనంతపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 870 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

'పది' పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ బాలస్వామి శనివారం నగరంలోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎంఈఓ వెంకటస్వామితో కలిసి ఆయన మారుతీనగర్ లోని కేశవరెడ్డి స్కూల్, గుడ్ చిల్డ్రన్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది పరీక్షలను పరిశీలించారు. ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, రంగారామ్, ఆనంద్‌ప్రసాద్,జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కమిషనర్ నగరంలోని మొదటి సర్కిల్ మస్టర్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. అనంతరం రెండో రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం, ద్వారకానగర్, అరుణోదయకాలనీ, నీలిమ థియేటర్ సర్కిల్ ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులను, దెబ్బతిన్న డ్రైన్‌లను పరిశీలించారు. అన్న క్యాంటీన్లలో భోజనం నాణ్యతను పరిశీలించారు.

ఈద్గాల్లో పారిశుధ్య పనులు పూర్తి చేయండి : మేయర్

అనంతపురం క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ నేపథ్యంలో నగరంలోని అన్ని ఈద్గాల వద్ద పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు నగర మేయర్ మహమ్మద్ వసీం ఆదేశించారు. ఆయన శనివారం మేయర్ వసీం నగరంలోని ఈద్గాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. రంజాన్‌లోగా పనులన్నీ పూర్తిచేయాలని, పండుగ రోజు నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. డ్రైవర్స్‌కాలనీ సమాధుల ప్రహరీ నిర్మాణానికి రూ.60లక్షలు, లైట్ల ఏర్పాటుకు రూ.15లక్షలు, హెచ్చెల్సీ కెనాల్ సమీపంలోని ఈద్గా ప్రహరీకి రూ.48లక్షలు మంజూరయ్యాని త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్ రహంతుల్లా, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పారా పోటీలకు జిల్లా వాసి



ఎంపికైన రోషిరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారా పోటీలకు జిల్లా క్రీడాకారుడు రోషిరెడ్డి ఎంపికయ్యారు. కంబోడియా దేశంలో ఈ నెల 25వ తేదీ నుంచి జరిగే మొదటి ఆసియా అంతర్జాతీయ పారా త్రోబాల్ టోర్నమెంట్‌కు భారత పారా జట్టు తరఫున రోషిరెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నారు. భారత పారా త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఆల్బర్ట్ ప్రేమ్‌కుమార్, జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు శంకర్‌నారాయణ రోషిరెడ్డికి అభినందనలు తెలిపారు.

ఖేలో ఇండియా పోటీల్లో తొలి రోజే జిల్లాకు రజతం



పతకం సాధించిన సాకే బాబు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా జాతీయ స్థాయి పారా పోటీల్లో తొలిరోజే జిల్లాకు పతకం దక్కింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ద్వితీయ ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారుడు సాకే బాబు పురుషుల షాట్‌పుట్ ఎఫ్56 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జిల్లాకు రజిత పతకం సాధించాడు. శాప్ డీడీ వెంకటరమణ, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ వినోద్‌కుమార్, డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్, అథ్లెటిక్ కోచ్ మంజుల, పారా స్పోర్ట్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సాకే బాబుకు అభినందనలు తెలిపారు.

ఘనంగా శాలివాహన జయంతి

అనంతపురం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచానపల్లిలో ఉన్న కుమ్మర శాలివాహన కల్యాణ మండపంలో శనివారం శాలివాహన జయంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ కుమ్మరి, శాలివాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, శాలివాహన సాధికారత సత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి తదితరులు శాలివాహనుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు యాలేటి గోపాల్, మలరాయడు, ఆంజనేయులు, నరసింహులు, లింగవర్థన్, రామాంజినేయులు, రాజేంద్రప్రసాద్, సూరి, నల్లప్ప, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మంత్రి కేశవ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి తనయుడు విజయ్‌సింహా

ఉరవకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలో శనివారం ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానికంగా ఉన్న ఏడు మసీదుల్లోనూ ముస్లింలకు మంత్రి తనయుడు విజయసింహ విందు ఏర్పాటు చేశారు. జామియా మసీదులో ముస్లింల చేత ఉపవాసదీక్షను విరమింపజేశారు. అలాగే జైనబ్బీ దర్గాలో ఉన్న మసీదులో భోజనం వడ్డించారు. తర్వాత రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, ప్యారం కేశవానంద, విజయ్‌భాస్కర్, మాజీ ఎంపీపీలు కుళ్లాయప్ప, సుంకరత్నమ్మ, టీడీపీ మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు

గుంతకల్లు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లింలకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. స్థానిక ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఈద్గా మైదానంలో ఏర్పాటు చేయనున్న ఇఫ్తార్ విందుకు పట్టణంలోని ముస్లిలందరూ తరలి రావాలని ఎమ్మెల్యే శనివారం పిలుపునిచ్చారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రుద్రాక్ష శనివారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అనాథ బాలికలు, బడిబయట పిల్లలు, పేద పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● కణేకల్లు: మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న కేజీబీవీలో 6వ తరగతితో పాటు ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ మంజుల కోరారు. అలాగే 7, 8, 9, 10వ తరగతులలో మిగిలిన సీట్ల కోసం బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

● శెట్టూరు: మండలకేంద్రంలోని కేజీబీవీల ప్రవేశాల కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ లలిత ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్‌కు 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు.

● బెళుగుప్ప: మండలకేంద్రంలోని కేజీబీవీలో ప్రవేశాల కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ నాగరత్నబాయి ప్రకటనలో తెలి పారు. 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్‌కు 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలోని మైలాపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలపురానికి చెందిన తిమ్మారెడ్డికి బెళుగుప్ప మండలం రామసాగరానికి చెందిన రామకృష్ణారెడ్డి కుమార్తె నీలిమతో ఆరేళ్ల క్రితం వివాహ మైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగా సాగింది. అయితే కొన్నాళ్లుగా భర్తతో పాటు అత్త గంగమ్మ, మరిది రంగారెడ్డి అదనపు కట్నం తేవాలని ఆమెను శరీరకంగా, మానసికంగా వేధించటం మొదలు పెట్టారు. రోజురోజుకు వేధింపులు అధికం కావడంతో తాళలేక నీలిమ ఈ నెల 14వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడే చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఆస్పత్రికి వెళ్లగా.. అత్తింటి వేధింపులు ఎక్కువ కావడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు ఆమె ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

యాడికి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 24వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు శనివారం ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ జరిగిందని, వాటి వివరాలను తెలిపేందుకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11గంటలకు ప్రజావేదికను నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

పుట్లూరులో 27న ..

పుట్లూరు: మండలంలోని ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి31వరకు జరిగిన పనులపై 17వ విడత ఆడిట్ జరుగుతున్న విషయం తెలిసిందే. వాటి వివరాలను వెల్లడించేందుకు ఈనెల 27వ తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదికను మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు.

కంబదూరులోకి కేఎస్ఆర్టీసీ బస్సులు నడపాలి

● టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఆందోళన

కంబదూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కేఎస్ ఆర్టీసీ బస్సులను మండలకేంద్రం లోపలికి నడపాలని స్థానిక టీడీపీ నాయకులు, గ్రామస్థులు శనివారం కేఎస్ఆర్టీసీ బస్సులను నిలిపి ఆందోళన చేశారు. పలువురు మాట్లాడుతూ.. నాలుగైదు రోజుల పాటు కంబదూరు లోపలికి వెళ్లిన కేఎస్ఆర్టీసీ బస్సులు మళ్లీ బయట వైపున ఉన్న బైపాస్ మీదుగా కళ్యాణదుర్గానికి వెళుతున్నాయన్నారు. దీంతో మరోసారి ఆ బస్సులను నిలిపి వేసి ఆందోళనకు దిగామన్నారు. కంబదూరు లోపలికి వచ్చి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్లదేనని అన్నారు. ఇష్టానుసారంగా బైపాస్ మీదుగా వెళ్లడానికి వీలు లేదన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు టీడీపీ నాయకులు, గ్రామస్థు లు కలిసి కేఎస్ ఆర్టీసీ బస్సులు మండలకేంద్రంలోపలికి నడిచేలా చూశారు.

భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి: ఆర్డీఓ

కంబదూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రెండో విడత భూ రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ వసంతబాబు సిబ్బందికి సూచించారు. మండలంలోని ములకనూరులో శనివారం భూ రీసర్వేపై తహసీల్దార్ బాలకిషన్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులతో కలిసి పురవీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడారు. రైతుల సమక్షంలోనే ఈ భూరీ సర్వేను సాఫీగా చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. సర్వేయర్ల బృందం, వీఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం నారాయణ స్వామి మాట్లాడుతూ రూ. 10 లక్షల వ్యయంతో రోడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని దోనిముక్కలలో ఉపాధిహామీ కింద ఫారం పాండ్స్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీటిని నిల్వ చేద్దాం

●ప్రజలకు అధికారుల పిలుపు ●ఘనంగా ప్రపంచ జలదినోత్సవం



పెద్దవడుగూరులో ఫాంపాండ్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పెద్దవడుగూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వర్షపునీటిని నిల్వ చేసి భూగర్భజలాలను పెంపొందిద్దామని ఏపీఓ పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచజలదినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని రైతు రవిశేఖర్‌రెడ్డి పొలంలో నిర్మించిన ఫాంపాండ్‌ను శనివారం ఏపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామి పథకంలో భాగంగా రైతులు తమ పంట పొలాల్లో ఫాంపాండ్లు నిర్మించుకొని భూగర్భజలాలు పెంపొందించుకోవాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు తమ పొలాల్లో ఫాంపాండ్లను నిర్మించుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. వర్షపునీటిని వృథా కానివ్వరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారన్‌సాబ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండల అధికారులు, టీడీపీ నాయకులు మండలకేంద్రంతో పాటు తగ్గుపర్తి, శీర్పి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ఫాంపాండ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. బెళుగుప్పలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున తదితరులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. టీడీపీ నాయకులు శివ, ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని బండమీదిపల్లి గ్రామంలో ఎంపీడీఓ లక్ష్మీశంకర్, ఏపీడీ రమేష్ నాయక్ పాంఫాండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ..జ వర్షపు నీటిని వృథా చేయకుండా ప్రతిఒక్కరూ నీటి కుంటలు తవ్వుకుని నిల్వ చేయాలని సూచించారు. భూగర్భజలం పెరిగితే సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, ఏపీవో రవీంద్ర, టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలకేంద్రంలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్‌ల నిర్మాణాలను ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వర్షపునీరు వృథాకాకుండా నిల్వ చేసేందుకు వీటిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో కొళాయిల వద్ద, నీటి సరఫరా ట్యాంకుల వద్ద నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలకు సూచించారు. టీడీపీ నాయకుడు లాలుస్వామి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ప్రభుత్వ కేటీఎస్ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ కేడెట్లు ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీటికుంటలు, చెరువులు మన దేశ వారసత్వ సంపదని అన్నారు. అవి కలుషితం కాకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మయ్య నీటి యొక్కప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఎస్ఎస్ ట్యాంక్ వద్ద ఎన్‌సీసీ విద్యార్థులు చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. వైస్‌ప్రిన్సిపాల్ రవిశంకర్‌శర్మ, లెఫ్టినెంట్ బాలకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు

● డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి హెచ్చరిక

● చిన్నారి మృతికి కారణమైన క్లినిక్ సీజ్

రాయదుర్గంరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అర్హత లేని వ్యక్తులు వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి హెచ్చరించారు. గత శుక్రవారం పట్టణంలోని ఆర్ఎంపీకి చెందిన మూసా క్లినిక్‌లో వైద్యం వికటించి మూడేళ్ల చిన్నారి మృతి చెందిన విషయం విధితమే. ఆ క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ శనివారం పరిశీలించి సీజ్ చేసి సదరు ఆర్ఎంపీకి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హతలేని వ్యక్తులు బోర్డులు పెట్టుకుని వైద్యమందించడమేమిటని మండిపడ్డారు. వచ్చీరాని వైద్యంతో అభం శుభం తెలియని ప్రజల ప్రాణాలు తీయడం బాధాకరమన్నారు. జీవించడానికి అనేక వృత్తులు ఉన్నాయని, తమ అర్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను ఎంచుకోవాలని సూచించారు. అర్హతలు లేకుండా వైద్యం అందించడం క్షమించరాని నేరమన్నారు. ఆర్ఎంపీలు క్లినిక్‌లలో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలన్నారు. ధనాశతో ఇంజక్షన్లు వేయడం, సెలైన్‌బాటిళ్ల ఎక్కించడం, యాంటీ బయాటికులు, స్టెరాయిడ్లు ఇవ్వడం వంటివి చేస్తే సహించమన్నారు. పట్టణంలోని అన్ని ప్రథమ చికిత్స కేంద్రాలకు నోటీసులు జారీ చేయాల్సిందిగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. ప్రతివీధిలోని ప్రథమచికిత్స కేంద్రాలను తనిఖీ చేసి హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి త్యాగరాజు, ఆరోగ్య వైద్యవిస్తరణాధికారి గంగాధర్, వైద్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

రాయదుర్గంరూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చిన్నారి మృతికి కారణమైన ఆర్ఎంపీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం నాయకుడు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు క్రొటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ జయనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారికి పట్టణంలోని మూసా క్లినిక్‌లో ఆర్ఎంపీ సెలైన్ బాటిల్ ఎక్కించి ఇంజక్షన్లు వేశాడని, అందుచేత చిన్నారి అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా మండలాల్లో కొన్ని నెలల నుంచి ఆర్ఎంపీల చికిత్స వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వీటిపైన విచారణ చేపట్టిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు కుమార్, జిల్లా సమితి సభ్యులు నాగయ్య, శంకర్, సురేష్, మారేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సంఘటనా స్థలం పరిశీలన

తాడిపత్రి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంటినిర్మాణం విషయంలో జరిగిన ఘర్షణకు సంబంధించి శనివారం డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 250మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పయాజ్‌బాషా ఇళ్లవద్ద పోలీసు సిబ్బంది మోహరించారు. దీంతోపాటు పట్టణంలోని నాలుగువైపులా పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశారు. కొత్తవ్యక్తులను ఎవరిని పట్టణంలోకి అనుమతించడం లేదు.

అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

●దళితుల డిమాండ్, ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న దళితులు

ఉరవకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ దళితుల హాస్టల్‌కు చెందిన స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 533-బీ1, సీలో 2.67ఎకరాల స్థలముందని, అందులో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని అన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని ఆ స్థలంలో దళితులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్, కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. దళితులు వరప్రసాద్, పెద్దన్న, రమేష్, ఓబులేష్, పెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొడదాం

● సోషల్ మీడియా వేదికగా తెలుగు యువత ముందుకు రావాలి

● టీడీపీ నేత దేవినేని ధర్మతేజ పిలుపు

కళ్యాణదుర్గం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రోజురోజుకీ అభివృద్ధి పథంలో దూసుకుపోతూ.. ప్రజల ఆదరాభిమానాలను పొందుతోందని, అదీ చూసి జీర్ణించుకోలేక వైసీపీ అసత్య ప్రచారాలకు తెరలేపిందని, వాటిని తిప్పికొట్టాలంటే సోషల్ మీడియా వేదికగా తెలుగు యువత ముందుకు రావాలని టీడీపీ నేత దేవినేని ధర్మతేజ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం ఆయన తెలుగు యువత నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సోషల్ మీడియాను ఏవిధంగా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వంపై సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. ప్రస్తుతం గ్రామస్థాయి నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు తెలియచేసే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలోని ప్రతి పోలింగ్ బూత్ నుంచి ఆసక్తి, పార్టీపై విధేయత ఉండి సోషల్ మీడియాను బాగా ఉపయోగించగలిగే ఐదుగురు యువకులను ఎంపిక చేస్తామని, వారికి ప్రజావేదికలో శిక్షణ ఇచ్చి సోషల్ మీడియాను ఎలా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ప్రతి గ్రామంలోను ఇక నుంచి తెలుగు యువత పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తెలుగు యువత నాయకులు, పార్టీ మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత దేవినేని ధర్మతేజ

సమగ్ర విచారణ చేపట్టాలి: సీపీఎం

ఉరవకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారు ఆభరాణాలు కాజేయడానికి ప్రయత్నం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు మధుసూదన్‌నాయుడు, రంగారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దేవాదాయ శాఖ అధికారులు చూడాలన్నారు. రథం తయారీలో కూడా అధికారులు విఫలమయ్యారన్నారు. రథం తయారీకి టెండర్లు పూర్తయి ఏడాది కావస్తున్నా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. బంగారు ఆభరణాలు కాజేసే కుట్రలో ప్రమేయం ఉన్న వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మురళి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల కోసం ఆర్థికసాయం

బొమ్మనహాళ్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన వృద్ధురాలు హరిజన అనంతమ్మ(80) అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి శనివారం ఆ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో చెరువు సంఘం అధ్యక్షుడు కురుబ కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

బెళుగుప్ప, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవులెన్న రైతు మల్లికార్జున సాగు చేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ శనివారం పరిశీలించారు. రైతు ఏడు ఎకరాల్లో పంట సాగు చేసి దిగుబడిలేక నష్టపోయారు. నకిలీ విత్తనాలతో పంట నష్టం జరిగిందని తెలుపగా.. వ్యవసాయాధికారి పరిశీలించారు. పంట దిగుబడి లేని విషయాన్ని శాస్త్రవేత్తలు, జేడీ దృష్టికి తీసుకెళతామని ఏఓ తెలిపారు.

అంత్యక్రియలకు స్థలం చూపండి

తాడిపత్రి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు స్థలం చూపించాలని మండలంలోని ఇగుడూరు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు అధికారులకు విన్నవించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పుల్లమ్మ(90), సువార్తమ్మ(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. వీరి మృతదేహాలను గ్రామ వంక సమీపంలో పూడ్చిపెట్టాలని కుటుంబీ కులు గుంతలు తీస్తుండగా పక్క పొలం వారు అభ్యంతరం చెప్పారు. అనంతరం పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దార్ రజాక్‌వలి, రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీకాలనీ వాసులు మాట్లాడుతూ.. గతంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని పలుమార్లు విన్నవించామని, ఇందుకు వంక పక్కన పూడ్చుకోవాలని అప్పటి అధికారులు చెప్పారని, అయితే ప్రస్తుతం ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. వంక పొరంబోకు స్థలంలో పూడ్చరాదని, మీకు స్థలం కేటాయించి శ్మశానం ఏర్పాటుచేస్తామని అధికారులు తెలిపారు. కానీ అప్పటివరకు మేము శవాలను ఎక్కడకు తీసుకువెళ్లాలని ప్రశ్నించారు. దీంతో అధికారులు ఏమీ చేయలేక అక్కడే పూడ్చడానికి అనుమతి ఇచ్చారు.

సనాతన సాంప్రదాయాన్ని కాపాడేందుకే పాదయాత్ర



పాదయాత్రగా వచ్చి నర్మదానంద స్వామి

కుందుర్పి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సాంప్రదాయాన్ని కాపాడేందుకే శక్తిపీఠాల దర్శనానికి సుదీర్ఘ పాదయాత్ర చేపడుతున్నట్లు మధ్యప్రదేశ్‌లోని జలకోటకు చెందిన నర్మదానంద స్వామీజీ పేర్కొన్నారు. పాదయాత్రలో భాగంగా ఆయన శనివారం బెళుగుప్పలోని నగరేశ్వర ఆలయం చేరుకున్నారు. స్థానికులు పలువురు స్వాగతం పలికి విశ్రాంతికి ఏర్పాట్లు చేశారు. స్వామీజీ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా శక్తిపీఠాలు దర్శనార్థం మధ్యప్రదేశ్ నుంచి పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు నాలుగేళ్ల మూడు నెలల్లో 17 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి 42 శక్తి పీఠాలలో 38 పీఠాలను దర్శనం చేసుకున్నాని తెలిపారు. ఇక నాలుగు మిగిలాయని, ప్రస్తుతం అలంపూర్ జోగులాంబ శక్తిపీఠానికి బయలుదేరుతున్నట్లు తెలిపారు.

పీఏబీఆర్‌లోకి చేపపిల్లల విడుదల



పీఏబీఆర్‌లోకి చేపపిల్లలను వదులుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కూడేరు, మార్చి 22 , (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ డ్యాంలోకి 5.4 లక్షల చేపపిల్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారుల జీవనాధారం కోసం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సబ్సిడీతో చేపపిల్లలను వదిలినట్లు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్‌నాయక్, మత్స్యశాఖ ప్రెసిడెంట్ నాగేష్, పీఏబీఆర్‌డ్యాం అధ్యక్షుడు బెస్త ఓబులేసు, సర్పంచు చంద్రశేఖర్, ఎఫ్‌డీఓ ఫక్కీరయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

యాడికి, మార్చి22(ఆంధ్రజ్యోతి): దంపతులపై దాడిచేసి గాయపరచిన సంఘటనలో శనివారం నలుగురిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. మండలకేంద్రంలోని కమ్మవీధిలో నివాసం ఉండే వెంకటశివ ఇంటిలో గతేడాది డిసెంబరు 1న చోరీ జరిగింది. ఈ సంఘటనలో 16తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. దీనిపై అనుమానితులపై వెంకటశివ పలుమార్లు పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో శనివారం మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయడానికి సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో వెంకటశివ, అతని భార్యపై కిట్టయ్య, ప్రవీణ్, దిలీప్, మరో మహిళ కలిసి దాడిచేసి గాయపరిచారు. దీంతో వెంకటశివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి

గుంతకల్లుటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రమాదేవి, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి శనివారం ప్రకటనలో సూచించారు. పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులో పేర్లు ఉన్న వారు ఈనెల 31లోపు రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. లేకపోతే ఏప్రిల్ 1వ తేదీ నుంచి రేషన్ వేయరని తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం

యల్లనూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 6గంటలకు ఆలయ ప్రాంగణంలో వేద పండితులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఇరు వర్గాల ఘర్షణ

గుత్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గాంధీ సర్కిల్లో వర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. కర్ణాటకకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో మంత్రాలయానికి వెళ్లి వస్తున్నారు. పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్దకు రాగానే మండలంలోని కొత్తపేటకు చెందిన జాన్‌తో పాటు మరో ఇద్దరు బైక్‌పై కారుకు అడ్డదిడ్డంగా వచ్చారు. దీంతో కారులోని వారు గొడవకు దిగడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలోఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

కణేకల్లు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీగా ఉన్న సంధ్య కొద్దికాలం క్రితం పదవికి రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాన్ని భర్తీ చేయాలని నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ అయిన ఎంపీపీ పదవి కోసం ఈ నెల 27 వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శనివారం తెలిపారు. 27న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ఉంటుందన్నారు. అనంతరం స్క్రూట్నీ, ఉపసంహరణ ఉంటాయన్నారు. ఒకటి కన్నా ఎక్కువగా నామినేషన్‌లు వేస్తే చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక ఉంటుందన్నారు. ఒకవేళ సింగిల్ నామినేషన్ వస్తే.. ఆ నామినేషన్ వేసిన వారినే ఎంపీపీగా ఎన్నుకుంటామని చెప్పారు. మండల వ్యాప్తంగా 18 ఎంపీటీసీ సభ్యులుండగా.. అందులో 50 శాతం మంది హాజరైనా ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

శెట్టూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన అనితకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 13,114లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును కళ్యాణదుర్గం పట్టణంలో టీడీపీ నేత దేవినేని ధర్మతేజ శనివారం లబ్ధిదారురాలికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, రాము బైక్‌లో గుత్తికి వస్తున్నారు. పట్టణ శివారులో రాగానే బైక్ అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గుత్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.